ఆదివారం
ప్రజాశక్తి
మే 29, 2005

ఏ చదువులు ఎందుకు చదివించాలి!

హ్యాపీ బర్త్‌డే

29.5.2005 నుంచి 4.6.2005 వరకు

రాహుల్
3సం॥, 29.5.2002
రమణి-రాజన్
హైదరాబాద్

సుమనిక
1సం॥, 29.5.2004
శ్రీలత-సుధీర్
నెల్లూరు

రుచితారెడ్డి
మే-31
రాధిక-సాంబశివారెడ్డి
తిరుపతి

చాముండేశ్వరి
6సం॥, 31.5.1999
లోకేశ్వరి-కుప్పుస్వామి
రేణిగుంట-చిత్తూరు

సానియా
1సం॥, 28.5.2004
సుల్తానా-అబుల్‌షహీద్
మహబూబ్‌నగర్

పవన్‌కళ్యాణ్
4సం॥, 4.6.2001
శ్రీలక్ష్మి-వెంకటేశ్వరరావు
లూటుకుర్రు-తూ॥గో॥



సంజయ్‌రాజ్(బన్ని)
4సం॥, 1.6.2001
మమత-మల్లేష్
అడ్డగుట్ట-సికింద్రాబాద్



ప్రవీణ్‌కుమార్
మాధవి-శ్రీధర్
కొండాపురం-నల్లగొండ



రీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



ప్రపంచ కుటుంబ దినోత్సవం

15వ తేదీ ఆదివారం కవర్‌స్టోరీగా "ప్రపంచ కుటుంబ దినోత్సవం" సంచిక చాలా బాగా వచ్చింది. ప్రతీ పేజీ కుటుంబాల ఫొటోలతో విశ్వకుటుంబ చిత్రాన్ని ఇచ్చారు. కవర్ డిజైన్ దగ్గర్నుంచి ప్రతీ ఐటమ్ ఇదే అంశంపై ఇవ్వడం ద్వారా ఇది ఒక ప్రత్యేక సంచిక అనదగ్గ సంచికగా రూపొందించారు. ఈ విధంగా ప్రపంచ కుటుంబ దినోత్సవాన్ని ప్రజాశక్తి పాటించడం ఘనంగా ఉంది.

–బి శ్రీనివాసాచారి,

కోదాడ, నల్గొండజిల్లా

కవర్‌స్టోరీ బాగుంది

ఈ వారం అనుబంధం కవర్‌స్టోరీ ప్రపంచ కుటుంబ దినోత్సవంపై రాసిన వ్యాసం మా అందర్నీ ఆకట్టుకుంది. మే 15వ తేదీని కుటుంబ దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి పిలుపునివ్వడం సమంజసంగా ఉంది. వ్యాసకర్త పేర్కొన్నట్లు రామాయణ, మహాభారత గాథల్ని నీతి బోధకాలుగా చెప్పుకోవాల్సిందేనని వివరించడం బాగుంది. మన ప్రభుత్వ పనితీరుల్లో పురుషాధిక్యత కొనసాగడం వల్లే ఈనాటికీ మహిళాబిల్లు లాంటివి ప్రవేశపెట్టలేక పోవడానికి కారణం. అలాంటి పాలకులు కుటుంబ వ్యవస్థకు అనుగుణమైన మార్పులు చేపట్టడం గగనమే.

–సిరిపురపు సంపూర్ణ చంద్రిక,

ఎనికేపాడు, విజయవాడ రూరల్

సినిమాల్లో కుటుంబం

ప్రపంచ కుటుంబ దినోత్సవ సంచికలో భాగంగా కళాసాహితి శీర్షికలో ప్రచురించిన వ్యాసం చాలా ఆసక్తికరంగా ఉంది. "సంసారం" నుంచి "సంక్రాంతి" దాకా సినిమాల్లో కుటుంబం గురించి చక్కని సమాచారం ఇచ్చారు. ఒకనాటి సినిమాల్లో చిత్రించిన కుటుంబ చిత్రణ ఎందుకు సక్సెస్ కాలేదో అదే అంశం ఓ పది సంవత్సరాల తరువాత ఎందుకు విజయవంతం అయ్యిందో విశ్లేషణ బాగుంది. ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు సాధ్యమే కాదు కానీ దానిని కోల్పోయిన ఒంటరితనం ఫీలింగ్‌ను క్యాష్ చేసుకునేవిధంగా నేటి సినిమాల్లో వరుసబెట్టి మెగా ఉమ్మడి కుటుంబాలను ఆకర్షణీయంగా తీస్తున్నారు. అది ఒక కాల్పనికతగా అందరికీ అర్థమయ్యేట్లు వివరించడం బాగుంది.

రమేష్‌బాబు, జవహర్ నగర్ కాలనీ,

చిక్కడపల్లి, హైదరాబాద్

గ్రూప్‌ఫొటో కవిత బాగుంది

ఈ సంచికలో కుటుంబ సంబంధాలపై మంచి కవితలు ప్రచురించారు. 'నిశ్చలన శబ్దచిత్రం' కవితలో 'రేపటి ఇల్లు...పటాన్ని మింగి, ఒళ్ళు పెంచి అగ్గిపెట్టె గదుల్లో ఆకాశ హర్మ్యం కానుంది' అని ఒక గ్రూప్ ఫొటో వర్ణనలోంచి ఎంత పరిణామాన్ని వివరించారో కదా అనిపించింది. కవికి ధన్యవాదాలు.

–జె జహంగీర్, రాపూరు, నెల్లూరుజిల్లా



కథ మా మనసులో నిలిచిపోయింది

'విడిపోయి కలిసుందాం' కథ మా మదిలో నిలిచిపోయింది. కథలోని రాఘవయ్య, విశాలాక్షి లాంటివారు ఈనాటి వృద్ధ తల్లిదండ్రులకు ప్రతిబింబాలు. కథలోని పరిష్కారం పాఠకుల మనసులకు ఎంత రిలీఫ్‌ను కలిగిస్తుందో చెప్పలేం. కానీ ఎంతమందికది సాధ్యమో మరి!

ఎమ్ మూర్తిరాజు, రైతుపేట, నందిగామ

ఫొటో తేడాగా అచ్చయ్యింది

'ఔరా' పేజీలో 'ఓడలే బళ్ళూ–బళ్ళు ఓడలు' అనేదానికి వచ్చిన ఫొటో, దానికి సంబంధంలేని 'తేనీరు వారోత్సవాలు' ఐటంకి కూడా వచ్చింది. ఇక ముందు అలాంటి పొరబాట్లు రాకుండా ఉండాలని కోరుతూ ఈ లోపాన్ని తెలియజేస్తున్నాను.

డి. ఆర్. ఆనంద్,

అనంతవరం, ప్రకాశంజిల్లా

ఇంతిసంగతులు

8వ తేదీ 'ఇంతిసంగతులు' లో పూవులు గురించి భర్తతో రకరకాలుగా వర్ణించి చెప్పడం చాలా బాగుంది. రచనా విధానం చక్కని శైలిలో సాగింది. మాకు చదవడానికి చాలా బాగుంది. జీవనశైలిలో బాధాకరమైన పరిణామంలో వివాహాలు–విడాకులు గురించి రాసినది ఆలోచింపజేసిదిగా ఉంది. కవితలు కూడా అర్థవంతంగా ఉన్నాయి.

–ఎం లలిత, కంచరాం, శ్రీకాకుళం జిల్లా

ఏ మిక్సీకాడ ఆ రిమిక్సీలు!!

"ఏ రోటికాడ ఆ పాట" అనేది మనకెంతో ఫ్లాష్‌బ్యాక్ నుంచి వస్తున్న సామెతే కదా అని వదిలేస్తే మనం చాలా మిస్ అవుతాం అనంటాను.

రోళ్ళూ-రోకళ్ళున్న కాలంలో దంచుడుపని ఒక వృత్తిగా ఉండేది కదా. ధాన్యమో, అపరాలో ఏవైతేనేం...పడేసి దంచుడేకదా! ఆ దంచుడుపనితో పాటు తమతమ ఆసాములెలాంటి వారో... వారిష్టాలకనుగుణంగా మసులుకుంటే మరింకేదన్నా లభించవచ్చని ఆశ. అందుకే ఆయా రోటికాడ ఆయా ఆసాముల పాట పాడితే సరి అని అనుకునుంటారు. ఏమైతేనేం ఏ రోటికాడ ఆ పాట అనేది ఈ అర్థంలో ఏమంత ప్రమాదం లేదు, యజమాని-పనివారి సంబంధం తెలియడం తప్ప!

కాలక్రమేణా... స్వార్థప్రయోజనాలాశించేవారి బుద్ధి బట్టబయలు చేసేలా ఆ సామెత గాఢత పొందింది. అలా సామెతయ్యాక మన లోకం తీరు చెప్పేందుకు తిరుగులేని పోలికగా అయ్యింది.

ఇప్పుడు మన ప్రపంచం రోళ్ళు దాటిపోయి చాలా రోజులైంది. లోకాన కూడా స్వార్థాల స్థాయి, మోతాదు పెరిగి ఆక్రమణ, దురాక్రమణ గ్లోబల్లీ అయ్యింది. మిక్సీలతో మీటయిన మిలీనియమ్‌లోకొచ్చాం. గ్రైండర్లతో ఫ్రెండ్‌షిప్పయి గ్లోబలైజయ్యాం కదా మరి!

రోలే లేకపోతే రోటికాడ పాటలింకెక్కడివి, 'ఏ రోటికాడ ఆ పాట' సామెత 'రోల్' ఎక్కడుందిక చెప్పండి?!

వ్యక్తిగత స్వార్థం కూడా లోకల్‌స్థాయి నుండి నేషనల్‌స్థాయి కూడా దాటేసి గ్లోబల్ స్థాయి జెయింట్ సైజ్‌కి ఎన్‌లార్జ్ అయ్యిందండి. ఇక ఇప్పటి పెనుమోసాలనూ, అంతర్జాతీయ స్వార్థాలనూ సరితూచేందుకు ఆఫ్టరాల్ 'ఏ రోటికాడ...."వగైరా సామెతేం సరిపోతుంది మరి.

అందుకే సామెతను సాధ్యమైనంత మ్యాగ్నిఫై లేదా మోడిఫై చేసి..."ఏ మిక్సీకాడ ఆ రిమిక్సీలు" అంటే, సరిపోక పోయినా నాజూగ్గా ఉంటుంది. "ఏ గ్రైండర్‌కాడ ఆ గ్రూప్‌సాంగు" అన్నా లేటెస్ట్‌గా ఉండి వర్థిల్లవచ్చును.

జార్జి వంశపు బుష్ కంపెనీ గ్రైండర్
ఈ గ్లోబునే ఓ రుబ్బు రుబ్బుతోంది కదా!

❖

ఈ సంచికలో . . .

ఓరా!! ... 3
కార్టూన్ కదంబం... ... 4
కవర్ స్టోరీ ... 5
జీవనశైలి ... 10
బాలల కథ ... 11
బాలనేస్తాలు ... 12
ఇంతి సంగతి ... 16
నువ్వద్ది ... 17
ఆరోగ్యం ... 18
పుస్తక పరిచయం ... 21
న్యాయసలహాలు ... 24

ఇంకా...

పంచాయితీ

కథ .. 8, 9

పసుపిట్ట

రియల్ స్టోరీ ... 14, 15



టూరిస్ట్‌గైడ్ ... 14, 15

ముజఫర్ అలీ
ఇప్పుడొక
'పద్మశ్రీ'

కళాసాహితి . . . 22, 23

రంగు పడుద్దీ...!

"రంగు పడుద్దీ" అనే డైలాగ్ ఓ కామెడీ మిక్స్‌డ్ సినీ విలన్‌ది. ఇప్పుడీ డైలాగ్‌ను జమ్మూ & కాశ్మీరీ పోలీసుల డ్యూటీ అయ్యింది. ఇటీవలే జమ్మూ-కాశ్మీర్‌లోని పోలీసుశాఖ వాటర్‌కేనన్ అనగా "నీళ్ళు పెళ్ళున జిమ్ము" యంత్రాన్ని 21 లక్షలు పెట్టి కొన్నారు. సదరు 'నీటి ఉక్కిరిబిక్కిరి' మిషన్‌లో రంగు కలిపి, మాకు అది కావాలి-ఇది కావాలి అని, ఫలానా డౌన్-డౌన్, ఫలానా జిందాబాద్-జిందాబాద్ అని టాపు లేపేవారిపై వాటర్ కేనింగ్ చేస్తారుట. దానితో ఒన్ బై టూ ప్రయోజనమ్స్ అంటున్నారు మన పోలీసుబాబాయిలు. నీళ్ళ పిచికారీతో పిచ్చపిచ్చగా వాళ్ళను చెదరగొట్టవచ్చు. ఆ తరువాత ఆ రంగునీళ్ళతో రంగుపడ్డవాళ్ళను సులువుగా గుర్తించి అరెస్టు చేయవచ్చంటున్నారు. ఇటీవలే వ్యాట్ పన్ను విధానాన్ని వ్యతిరేకించి ధర్నాలు చేసినవారిపై మొదటిసారిగా రంగు పడిందంట!

చతుష్పాదులు చుట్టాలై వచ్చినవేళ...!

ఛండీఘర్‌లో వినోద్‌కుమార్ పెళ్ళిలో విశేషం ఏమంటే...అతని విద్యార్థులు కూడా అతిథులవ్వడమే. ఇంతకీ అతని విశేష అతిథులెవ్వరా అని ఆశ్చర్యపోకండి. అతని చేతిలో ట్రైనింగ్ పొందుతున్న కుక్కలు కూడా తమ మాస్టర్ పెళ్ళికి ఆహూతులయ్యాయి. అందర్నీ పిలిచినట్లే తన విద్యార్థులైన లెబ్రడార్, మస్టిఫ్, పగ్ జాతికి చెందిన ఓ డజన్ కుక్కల్ని కూడా పిలిచాడు. తమ ఇష్ట గురూజీ వినోద్‌గారికి వినయపూర్వకంగా తమ శుభాకాంక్షలు అందజేశాయి. "విషింగ్ యూ భౌభౌ... హ్యాపీ మ్యారీడ్ లైఫ్. భౌభౌ! భౌభౌ!!"

గుంపులో గోవిందయ్యలా... పరాహుషార్!

మన గోవిందయ్యకు తెల్లారితే అరవై గడపలనుకోండి. ఎక్కడని పట్టుకుంటాం. కానీ ఆ పూట అతగానీ అవసరం యమా అర్జంటనుకోండి... ఎలా వెతకడం? ఏ గుంపులో మన గోవిందయ్య ఉన్నాడో సెర్చింగ్ ఎట్లాగా?! ఆ పని సులువు చేశారు జపాన్ తోషిబా కంపెనీవారు. వారు ఇటీవల కనిపెట్టేసి, తయారుచేసేసీ, మార్కెట్టులో పెట్టిన ప్రత్యేక రోబో "అప్రిఆల్ఫా వి-మూడు" వ్యక్తుల గొంతుని బట్టి ఇట్టే గుర్తుపట్టేస్తుందట. మనకి పట్టి ఇస్తుందట. దాన్నొకదాన్ని కొనిపెట్టుకుని...మన అస్మదీయుల, తస్మదీయుల కంఠస్వరాల్ని నమోదు చేయించుకుని ఉంటే ఇలాంటప్పుడు పనికొస్తుంది. మన గోవిందయ్య ఏ గుంపులో ఉన్నాడో అక్కడి రిమోటుద్వారా గొంతుల్ని వినిపించితే ఆ గుంపువారి గొంతుల్లో మన అన్మదీయం గోవిందయ్య గొంతుందో లేదో తెలిసిపోతుంది. మన గొంతుంటే ఆ గొంతుకి చెందిన శరీరమూ-శాల్తీ దొరికినట్టే!!



కార్టూన్ కదంబం


ఏమండీ మీరు పొరపాటున
పోయారనుకో మా పార్టీ వాళ్ళు
నాకు టికెటిస్తారంటారా?

మర్యాదగా నీ ఓటు
వేసి గెలిపించ ప్రార్థన..!
ఉప ఎన్నిక


...మీరు ఇంతవరకు
ఇచ్చిన హామీలన్నీ
తీరుస్తానని
నాకు మరో
హామీ ఇవ్వండి!


'బ్యాంకు'లో తన ఒప్పందాలకు
వైయస్ కూడా యస్ యస్
అంటున్నాడుగా మరి!

ఏ చదువులు ఎందుకు చదివించాలి!

డా॥ కాకర్లమూడి విజయ్

మంచికో, చెడుకో తెలీదు గానీ, మన జీవితాల్లో చదువులు మాత్రం అత్యంత కీలకమయ్యాయి. జీవితాన్ని సుఖమయంగా నడిపించడానికి ఉపయోగపడవలసిన చదువులు కొండొకచో జీవితాల్నే శాసిస్తున్నాయి. హరిస్తున్నాయి. అది చదువుల వ్యవస్థ లోపమా? చదివించే పెద్దల లోపమా, చదివే పిల్లల లోపమా? అసలు ఏ ఉద్దేశంతో చదువులు రూపొందించబడ్డాయి. ప్రస్తుత ప్రయోజనం ఏమిటి?

'చదివితే మంచి మంచి ఉద్యోగాలొస్తాయి', 'చదువు వల్ల సొసైటీలో స్టేటస్ ఉంటుంది, గుర్తింపు ఉంటుంది', 'ఇంజనీర్లు, డాక్టర్లు, కలెక్టర్లు అవ్వొచ్చు'... ఇవీ మనకు లభించే సమాధానాలు. చదువు తాలూకు అసలు ఉద్దేశమేదైనా, ఆ చదువుని ప్రజలలోకి తెచ్చే 'మేధావులు, నిపుణుల' ప్రణాళిక ఏదైనా, సాధారణ మానవుడికి చదువు జీవితంలో బాగా/సుఖంగా/నిశ్చితంగా/ఉన్నతంగా/గౌరవంగా స్థిరపడటానికి ఉపయోగపడే ప్రక్రియ మాత్రమే.

ఏ చదువులు ఎందుకు చదవాలి! చదివించాలి?!

పిల్లలు పుట్టిన వెంటనే స్కూళ్లలో సీట్ల గురించి ప్రయత్నించడం నుండి ఏ స్కూలు, ఏ మీడియం, ఏ గ్రూపు, ఏ కోచింగు వంటి మీమాంసలు దాదాపు ప్రతి కుటుంబంలోనూ సాధారణమైపోయాయి. ఈ తొందరలో అసలు చదువుకి ఉన్న అర్థం అదృశ్యమైపోయిందని గ్రహించడం లేదు.

సాధారణంగా ఒక వృత్తిలో స్థిరపడ్డవారు అదే వృత్తిని తమ పిల్లలు కూడా కొనసాగించాలనుకోవడం ఉండేది. ఈనాడు కమ్మరి, కుమ్మరి వంటి సాంప్రదాయ వృత్తుల వారు తమ పిల్లలను 'మంచి' చదువులు చదివించడానికే ఉత్సాహం చూపుతున్నారు. వారి పిల్లలూ తమ తండ్రుల వృత్తులను కొనసాగించడానికి సుముఖంగా ఉండటం లేదు. తమ పిల్లలు తమకన్నా మంచి జీవితం గడపాలన్నది వీరి ఆశ. అందుకు చదువు దోహదపడుతుందని నమ్మకం. మరోపక్క చదువుకొని స్థిరపడిన వాళ్లు తమ పిల్లలు తమ దారిలో నడవాలనీ, తమ వృత్తిలో కొనసాగాలనీ అనుకోవడం పరిపాటి. అందుకే డాక్టర్లు, ఇంజనీర్ల పిల్లలు తమలాగే డాక్టర్లు, ఇంజనీర్లు అవ్వాలని కోరుకుంటున్నారు. అందుకు మార్గమూ చదువే. తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని వారికి ఇష్టం లేకపోయినా చదువు చెప్పించాలా? లేదా తమ పిల్లలు తమ దారిలోనే నడవాలని వారిలో సత్తా లేకపోయినా బలవంతంగా చదివించాలా? ఏ చదువు ఎందుకు చదివించాలి? అసలు ఏ చదువైనా, ఎందుకు చదివించాలి?

'చదువు లేకపోతే సమాజం చిన్న చూపు చూస్తుంది. అటువంటి వారిని ఎవ్వరూ పట్టించుకోరు, వారికి విలువ గౌరవం ఇవ్వరు' అనేది సర్వత్రా వ్యక్తమైన అభిప్రాయం. మరి విలువనిచ్చే చదువే చదివిస్తున్నామా అంటే సమాధానం దొరకదు. చదవుల వల్ల విలువలు పెరుగుతాయో లేదో చెప్పలేం గానీ చదువులు మాత్రం అతి విలువైన (ఖరీదు బట్టి) వస్తువుగా తయారైంది. అయినా వెనుకాడే వారే లేరు. 'కష్టమో నష్టమో. పిల్లల్ని కన్నాక చదివించకుండా ఉంటామా?', అని అడుగుతుంది నర్సమ్మ. నర్సమ్మకి ముగ్గురు పిల్లలు. ఆమె ఇళ్లలో పనిమనిషిగానూ, వాళ్ల ఆయన కూరగాయలు అమ్మడంతోను కాస్తో కూస్తో సంపాదిస్తారు. ముగ్గురు ప్లిలల్నీ 'కాలేజ్ చెయ్యించాల'న్నది ఆమె ఆశ.

విశేషమేమిటంటే చదువుకి అధిక ప్రాధాన్యత



నిచ్చేది మధ్య తరగతి నుండి క్రిందిస్థాయి కుటుంబాలే. బాగా ధనికులు, వ్యాపార కుటుంబాలలో ఇది అంతగా కనిపించదు. తమ వ్యాపారాలను నిర్వహించుకునే తెలివి తమ పిల్లలకు ఉంటే చాలన్నది వారి అభిప్రాయం. అయితే పిల్లల్లో చదువుకోవాలన్న కోరిక, చదివే శక్తీ ఉంటే వారు చదవించేందుకు వెనుకాడరు.

. ముందుగా మంచి స్కూలు ఎన్నుకోవడం. పట్టణ/నగర వాసులైతే ఆర్థికంగా ఇబ్బంది పడ్డా, కాస్త ఖరీదైన 'ఇంగ్లీషు' మీడియం స్కూలులో చేర్పించడం పరిపాటి. పిల్లలు స్కూలు నుండి ఇంగ్లీషులో మాట్లాడుతూ ఇంటికి రావడమే ప్రాథమిక కోరిక. ఆ తరువాత కొన్ని సంవత్సరాలకి ప్రారంభమయ్యే సమస్య ఏ సిలబస్ తీసుకోవాలన్నది. "సిబియస్ఇ", "ఐసియస్ఇ" లు చాలా విస్తృతమైన సిలబస్‌తో ఉంటాయి. 'కోరి పిల్లల్ని కష్టపెట్టడం ఎందుకు? స్టేట్ సిలబస్సే బెటర్' అన్నది చాలా మంది విద్యాధికులైన తల్లిదండ్రుల వాదన. స్టేట్ సిలబస్ అయితే పదవతరగతి మార్కుల ప్రాతిపదికన ఎం.పి.సి.నో, బై.పి.సి.నో, సి.ఇ.సి.నో తీసుకోవడం, ఆ తరువాత ఇంజనీరో, డాక్టరో, సిఏ నో చేసేయాలనుకోవడం... కానీ వాస్తవం ఇంత నేరుగా, సరళంగా ఉండదు. లేదు. పూర్వంలా కాకుండా ఉన్నత చదువులు చదివినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. అసలు సాంప్రదాయకమైన చదువులవల్ల అటు ఉపాధికీ, ఇటు సంతృప్తికీ ఉపయోగం ఉండటం లేదన్నది అందరూ అంగీకరిస్తున్నారు. అందుకనే ఆధునాతనంగా పుట్టుకొచ్చిన కోర్సులు ప్రజాదరణ పొందాయి. అదే విధంగా స్వల్పకాలిక, స్పెషలైజ్డ్ కోర్సు కూడా పేరొందాయి. ఏదో ఒక రకంగా ఇంటరుగానీ, డిగ్రీగానీ చేయగలిగితే, ఈ కొత్తతరం కోర్సులు మంచి ఉపాధికి తోడ్పడుతాయి.

ఆ డిగ్రీలయ్యాక ఆకర్షణీయమైన ఉద్యోగాలు సులభంగా లభించవన్న వాస్తవాన్ని గ్రహించి 'చదువు'ను రిసెర్చ్ వరకూ కొనసాగిస్తున్నారు. రిసెర్చ్ పూర్తయ్యాక కూడా అవకాశాలు రాక, వచ్చినా ఉపయోగించుకోలేక, పరిశోధనా ఉద్దేశాన్ని మరిచి మళ్లీ ఏ టీచింగ్ జాబ్‌లోనో చేరి కాంప్రమైజ్ అయిపోవడం మామూలైపోయింది.

పిల్లలలో సహజంగా కొన్ని అభిరుచులు

ఉంటాయి, అభిప్రాయాలుండవు. ఆసక్తులు ంటాయి, అవగాహన ఉండదు. అమాయకపు ఆశలుంటాయి, ఆశయాలుండవు. అభిమానాలుంటాయి, ఆలోచనలుండవు. కోరికలుంటాయి, లక్ష్యాలుండవు. వారి సహజ బలాలను గమనించి వారి అభిరుచులకు, ఆసక్తికీ తగిన ప్రోత్సాహాన్నిచ్చి, సరైన దారి చూపి, అందుకు అనువైన చదువును అందించగలిగితే ఆ చదువువల్ల సంపూర్ణ ప్రయోజనం పొందే వీలుంది.

'కష్టపడి' కంటే ఇష్టపడి చదవటం మేలు!

ఒక డాక్టరు పిల్లవాడికి ఫ్యాషన్ డిజైనింగ్ అంటే ఇష్టమనుకోండి, కానీ, తండ్రి మాత్రం ఆ విషయంలో పిల్లవాడిని ప్రోత్సహించడానికి అయిష్టత చూపుతాడు. ఇప్పటికీ మన కుటుంబాల్లలో బొమ్మ

లేయడం ఒక 'పిచ్చే'! జర్నలిజం, హోటల్ మేనేజ్‌మెంట్ వంటి చదువులు 'పనికిరానివి'. ఇంజనీరింగ్ చదివి నిరుద్యోగిగా మిగిలితే 'ఇంత చదివించినా ఉద్యోగం లేదు' అని వాపోవడంలో ఆనందం పొందుతాము. ఎంబిఏ చదివి అండర్‌వేర్లు అమ్మే ప్రణాళికలు వేస్తే 'మార్కెటింగ్ కింగ్' అని పొంగిపోతాము.

ఇన్ని విరుద్ధ కోణాలలో ఉన్న విద్యా–ఉపాధి రంగాలలో ముందునుండే వేసుకున్న ప్రణాళికలు పనిచేస్తాయా? పనిచేయక పోవచ్చు. బ్యాంకులో ఉద్యోగి అయిన పెద్దిరాజుగారు మొదటి అబ్బాయిని ఇంజనీరు, రెండవవాడిని డాక్టరు చెయ్యాలని అనుకున్నారు. ఇంటరులో పెద్దవాడిని ఎంపిసి తీసుకోమన్నారు. రెండవ వాడికి లెక్కలు, బయాలజీలలో ఏది ఇష్టమో, అయిష్టమో తెలుసుకునే ప్రయత్నం కూడా చెయ్యకుండా బైపిసిలో చేర్పించారు. ఎం.పి.సి తీసుకున్నవాడు అత్తెసరు మార్కులతో,ఇంటరు గట్టెక్కి ఎంసెట్‌లో సీటు దొరక్క అప్పుడు వచ్చిన బిసిఏలో చేరాడు. అదయ్యాక, అప్పుచేసి అతన్ని ఆస్ట్రేలియా పంపారు. ఇప్పుడతను 'నెట్‌వర్కింగ్' లో నైపుణ్యం సంపాదించి మంచి ఉద్యోగం సంపాదించాడు. ఒకవేళ అతనే ఎంసెట్‌లో సీటు తెచ్చుకుని ఉంటే? ఈ పాటికి ఇంకా ఇంజనీరింగ్ చేస్తుండేవాడు. 'అంతా మన మంచికే' అంటున్నారు రాజుగారు. బైపిసి చేసినవాడు కూడా ఎంసెట్ రాశాడు. సీటు రాకపోతే కొత్తగా వచ్చిన అనేక కోర్సులలో ఒకదాంట్లో డిగ్రీ చేయించి, ఎంఎస్ కోసం అమెరికా పంపాలని కొత్త ప్రణాళిక వేశారు.

ఇది ఒక వాస్తవ ఉదాహరణే అయినా ఇలా జరిగేది ఒక్క పెద్దిరాజు గారింట్లోనే కాదు. చదువుకునే పిల్లలున్న 90% కుటుంబాలలో ఇదే కనిపిస్తుంది. కాస్త అటూ ఇటూగా!

పిల్లల్లో అవగాహన తక్కువుంటుందన్న విషయాన్ని పెద్దలు తమ అహంతో తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. 'ఆc వాడికేం తెలుసు' అని తేలిగ్గా తీసిపారేసి, పిల్లల తరుపున పెద్దలే నిర్ణయాలు తీసేసుకుంటున్నారు. ఆ నిర్ణయాలని బలవంతంగా పిల్లలపై రుద్ది అద్భుత ఫలితాలను ఆశిస్తున్నారు. అయితే ఏ కొద్ది మందికో తప్ప అటువంటి 'అద్భుతాలు' అనుభవంలోకి రావడం లేదు. "పిల్లలకి ఏమీ

ఏ చదువులు ఏం చేస్తాయి?

ఇంగ్లీషు/తెలుగు మీడియం అన్నది పిల్లల నేపథ్యం, అవసరం, శక్తి బట్టి నిర్ణయించాలి. కానీ ఉన్నత స్థాయి చదువులో ఇంగ్లీషు మీడియం వాళ్లు త్వరగా రాణించే వీలుంది.

సెంట్రల్ సిలబస్ (ఐసిఎస్ఇ/సిబిఎస్ఇ) చదివితే ప్రమాణాలు ఎక్కువగా ఉంటాయి. అవకాశాలూ ఎక్కువగా ఉంటాయి. మన రాష్ట్ర ఎంసెట్ ద్వారానే బిఇ/ ఎం.బి.బి.ఎస్ చదవాలనుకుంటే స్టేట్ సిలబసే మంచిది. బి.ఐ.టి.ఎస్, ఐఐటి వంటి ప్రామాణిక సంస్థలలో చేరడానికి సెంట్రల్ సిలబస్ ఎక్కువ తోడ్పడుతుంది. ఇంటరులో సిఇసి/ఎంఇసి తీసుకుని కూడా ఉన్నత చదువులకు వెళ్లవచ్చు. (ఐసిడబ్ల్యుఎ, సి.ఎ, లా ఎక్స్‌ట్రా) ఏదైనా డిగ్రీ తరువాత బి.ఇ.డి, ఎంఇడి చేసి టీచింగ్‌లో ప్రభుత్వ/ప్రైవేట్/ విదేశీ రంగాల్లో ఉపాధి పొందవచ్చు. ఏదైనా డిగ్రీ చేసి కంప్యూటర్ రంగంలోకి వెళ్లవచ్చు. బి.కామ్ వాళ్లు కూడా! పదవ తరగతి/ ఇంటర్ తరువాత వొకేషనల్ కోర్సులు చదివితే ఉపాధి లభించే అవకాశాలున్నాయి.

కళలలో ప్రతిభ ఉన్నవారు ఆ దిశగా చదివితే రాణింపు వుంటుంది. విదేశాలు వెళ్లాలనుకున్న వాళ్లు ఆర్ట్స్ కాకుండా సైన్సు వైపు కొనసాగడం మంచిది.

డిగ్రీ తరువాత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కొరకు పోటీ పరీక్షలకి సిద్ధపడవచ్చు. కష్టపడితే, సాధారణ తెలివితేటలతో కూడా ఐ.ఎ.ఎస్/ఐపిఎస్ సాధించవచ్చు. ఇంజనీరింగ్ చేసినా ఎం.బి.ఎ వంటి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉంటే ఉద్యోగావకాశాలు ఎక్కువ. ఎం.బి.బి.ఎస్ చేసినా ఎం.డి/ఎమ్ఎస్ వంటివి చేయకపోతే ప్రయోజనం తక్కువ. ప్రత్యేక డిప్లొమాలలో (బయోఇన్ఫర్మేటిక్స్, యానిమేషన్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, జర్నలిజం, పర్సనల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషల్ వర్క్) వంటి వాటికి ఏదో ఒక రకంగా ప్రయోజనం ఉంటుంది. కరస్పాండెన్స్ కోర్సులు, సార్వత్రిక కోర్సులు అకడమిక్ క్వాలిఫికేషన్ మెరుగుపరుచుకోడానికీ ఉన్న ఉద్యోగంలో పై స్థాయి కొరకు ఉపయోగ పడతాయి తప్ప వాటి సాయంతో కొత్త ఉద్యోగాలు కష్టం. సాంప్రదాయానికి భిన్నంగా వెళ్లే సాహసం గలవారికి ఫాషన్ డిజైనింగ్, హోటల్/ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఇంటీరియర్ డిజైన్ వంటివి మంచిది.



చదువు విషయంలో ఈ సూచనలు గమనించండి.

పిల్లల ఆసక్తిని గమనించండి, విలువనివ్వండి, గౌరవించండి. సహజ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం చాలా అవసరం. అలా కాని పక్షంలో కనీసం నిరుత్సాహపరచకుండా అయినా ఉండాలి. తమకి నచ్చిన వాటికి ప్రోత్సాహ ముంటే పెద్దలు చెప్పినవి కూడా పాటిస్తారు. మానసిక శాస్త్రంలో 'సజెషన్' అనే ప్రక్రియ ఉంది. ఒక విషయాన్ని పదే పదే చెప్పడం వల్ల ఆ విషయం మనసుకి హత్తుకుపోతుంది. ఈ ప్రక్రియని ఉపయోగించి పిల్లలలో కావలసిన మార్పు తీసుకురావచ్చు. 'నువ్వు పనికిమాలిన వాడివి', 'నీకు తెలివి లేదు', 'మొద్దువి', 'మా కడుపున చెడపుట్టావు', 'ఎందులో అయినా పడి చావ రాదూ'... వంటి మాటలు సజెషన్‌లే కాకపోతే అవి సజేషన్‌లలా పని చేస్తాయని తెలీకుండా మనం తరచూ అనేస్తుం టాం. దాంతో మొండి తనం, అలక్ష్యం, నిర్లక్ష్యం, అత్మన్యూనత పెరిగి ఆత్మహత్య ప్రవృత్తికి కూడా దారి తీస్తుంది జాగ్రత్త. ఏం చదవాలో పిల్లలతో కలిసి చర్చించండి. వారి అభిప్రాయా లకూ విలువనివ్వాలి. పెద్దల సూచనలు శాసనాలు కాదు అనే అభిప్రాయం కలిగించాలి. మీ చుట్టాల పిల్లలు, పక్కింటివాళ్ళు ఫలానా చదువు తున్నారు

కాబట్టి మీ పిల్లలూఅదే చదవాలను కోవద్దు. వ్యక్తిగత స్థాయిలో, పరిస్థితులు వేరుగా ఉంటాయి. పిల్లల ముందే వారిని ఇతరులతో పోల్చి కించపరచడం మంచిది కాదు. అది 99% మందిలో నెగెటివ్ ప్రభావాన్ని చూపుతుంది. పోలికని పాజిటివ్‌గా తీసుకోవడం పెద్దలకే చేతకాదు. చదువు విషయంలో మీ పిల్లలు మీ మాట విని తీరాలని పట్టుబట్టకండి. ఘర్షణ లేకుండా సున్నితంగా చెబితే వింటారు. పిల్లల చదువుకు, ఆరోగ్య కరమైన వికాసా నికీ ఇంటి వాతావరణం అత్యంత ముఖ్యం. అది ఎంత ప్రశాంతంగా, అనుకూలంగా, స్నేహపూరితంగా, భయరహితంగా ఉంటే అంత ఆనందంగా చదువులు సాగుతాయి.

చదువులో పోటీ ఉంటుంది. పోటీ ఉన్న చోట గెలుపుకన్నా వైఫల్యాలు ఎక్కువ ఉంటాయి. చదువు జీవితంలో ఒక భాగం. చదువే జీవితం కాదు. దాన్ని గురించి జీవి తాన్ని ఇబ్బంది పాల్జేసుకోనక్కర్లేదు.

తెలియందనే ఒకే పాయింటుపై పెద్దలు వారి సహజ ఆసక్తిని అణిచివేస్తున్నారు" అంటున్నారు ఒక కాలేజీ లెక్చరర్. "అటువంటి ఆసక్తిలేని వారికి చదువు చెప్పడం ఉపయోగంలేని పని అని నా అనుభవం" అంటారాయన. ఆసక్తి లేకుండా చదవడం (ఆ మాటకొస్తే వేరే ఏ పనైనా సరే) వల్ల మంచి ఫలితాలు రావు. ఆసక్తిని కలిగించడం, కలిగేలా పరోక్షంగా ప్రయత్నించడం ఇంట్లో, విద్యాసంస్థల్లో జరగవలసి ఉంది. దురదృష్టవశాత్తూ ఆ ప్రయత్నాల కంటే ఏ విధంగా సిలబస్‌ని నిర్ణీత కాలపరిమితిలో పూర్తిచేయాలి, ఏ విధంగా పరీక్షలు గట్టెక్కెలా చూడాలి అన్న ఆత్రుత అధికమై చదువు మెకానికల్‌గా మారిపోయింది. ఒత్తిడి పెరిగిపోయింది. ఫలితంగా కుటుంబాలలో ఘర్షణ, మానసిక హింస పెరిగిపోయాయి.

"నేనీ కోర్సులో చేరడానికి చిన్నపాటి యుద్ధమే జరిగింది" అంటున్నాడు సురేష్ కుమార్. అతను చేసిన కోర్సు 'అప్లైడ్ ఆర్ట్'. "ఇంజనీరు అవ్వాలని ఇంట్లో బలవంత పెట్టే వాళ్ళు. నాకేమో పెయింటింగ్ ఇష్టం. మేం చెప్పింది చదవకపోతే ఇంట్లో ఉండద్దన్నారు. రోజూ గొడవ జరిగేది. ఇంజనీరింగ్ చదవలేనని నాకు అనిపించేది. చాలాకాలం గొడవ తర్వాత బంధువుల సాయంతో నేను జెయన్‌టియులో చేరాను". ఇప్పుడు సురేష్‌కుమార్ ఒక ప్రముఖ అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలో ఛీఫ్ విజువలైజర్. నెలకి ఐదంకెల జీతం.

డబ్బు, హోదా, గౌరవమూ వంటివి సంపాయించినా, ఇంకాస్త మంచి చదువు ఉంటే బావుండేదని అనిపించే వాళ్లూ ఉన్నారు. కుటుంబ పరిస్థితుల వల్ల, ఇతర కారణాల వల్ల చిన్న చదువుతోనే ఆపి, ఉద్యోగాలు చేసి పైకొచ్చిన వాళ్ళు చాలామంది ఉన్నారు.

చదివిందొకటీ... ఉద్యోగమింకొకటీ!

చదువుల్లో వింతవైరుధ్యాలు ఉంటాయి. ఆరేళ్లపాటు పరిశోధన చేసి పిహెచ్‌డి పట్టాపుచ్చుకున్న వాళ్లు అందరూ సైంటిస్టులు కాలేదు. అసలు పరిశోధనతో సంబంధంలేని ఉద్యోగాలు చేసేవాళ్లూ ఉన్నారు. డా॥రియాజ్ బయోకెమిస్ట్రీలో పి.హెచ్.డి. విదేశాల్లోనూ, స్వదేశంలోనూ పరిశోధనాపరమైన ఉపాధి ప్రయత్నాలు విఫలమయ్యాయి. "లెక్చరర్ అవ్వడం ఇష్టంలేదు. అందుకనే వ్యాపారం లోకి వచ్చాను" అన్నాడు రియాజ్. డా॥రియాజ్ చేసే వ్యాపారం బయోకెమిస్ట్రీకి సంబంధం లేనిది. కళ్లద్దాల వ్యాపారం! "చదువుకి తగ్గ ఉద్యోగం దొరకలేదు. కారణాలు ఏమైనా కావచ్చు. జీవించాలంటే ఏదోవిధంగా సంపాదించాలి. వ్యాపారం అన్నాక ఏదైనా ఒకటే. చదివిన దాని దారిలోనే పోవాలంటే కానిపని. ఇప్పుడు వ్యాపారం బాగానే ఉంది. కానీ ఇది చేయడానికి ఇన్ని సంవత్సరాలు కష్టపడి అంత అత్యున్నత చదువు చదవాలా? అన్న బాధ ఉంది" అంటాడు.

వాస్తవానికి చదువుకున్నదంతా ఎప్పుడూ ఎక్కడా ఉపయోగపడిన దాఖలాలు లేవు. మరీ ఉన్నతస్థాయిల్లో చదివినదే ఉపయోగపడుతుందేమో. చిన్నప్పుడు చదివిన ఆల్జీబ్రా గానీ, ఫిజిక్సు సూత్రాలు గానీ, చరిత్రగానీ పెద్దయ్యాక అక్కరకు రాకపోవడమే ఎక్కువగా చూస్తాం.

ఎడ్యుకేషనల్ హాట్‌కేక్స్!!

చదువుల ప్రాముఖ్యత తరచూ మారుతుంటుంది. కొంతకాలం క్రితం వరకూ ఉన్న 'ఎంసెట్



ఏదే చదువు లేదు' అన్న పరిస్థితి నుంచి కాస్త మార్పు వచ్చింది. కొన్ని సంవత్సరాల క్రితం ఐఐటి పట్ల ఆంధ్రలో అవగాహనే లేదు. ఈ రోజు ఇక్కడి నుండే అధిక సంఖ్యలో ఐఐటికి వెళ్తున్నారు. ఎనిమిదో తరగతి నుండీ ఐఐటికి ఫౌండేషన్ కోర్సులు నిర్వహిస్తున్నారంటేనే దాని ప్రభావం ఎంతుందో తెలుస్తుంది! కళాశాలల సంఖ్య పెరగడంతో నేడు ఇంజనీరింగ్ పట్ల ఆసక్తి పల్చబడింది. నిన్నా మొన్నటి వరకూ లేని బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్ వంటివి ఈ రోజు హాట్ కోర్సులు. 'సర్వ ఉపాధిసాధనాశాస్త్రం' గా ఊహించబడ్డ బీసిఎ, ఎంసిఎలు నేడు లేవు. ఒక వెలుగు వెలిగిన మెయిన్ ఫ్రేమ్స్, జావా వంటి ఐటి చదువులు కొత్తగా వచ్చిన కోర్సుల వెలుగులో మరుగున పడ్డాయి.

పూర్వంలా కాకుండా ఇప్పటి కొన్ని కోర్సులు అనూహ్యమైన జీతాలతో ఉద్యోగాలనిస్తున్నాయి. అటువంటి చదువులలో ఏ కాస్త చురుకుదనం చూపినా విదేశీ కంపెనీలు పిలిచిమరీ ఉద్యోగాలిస్తున్నారు. **IIT, IIM, BITS, XLRI, IIIT, IBS** వంటి సంస్థలలో చదువుకోగలిగితే భవిష్యత్తు బంగారమైనట్టే. కానీ వాటిలో చేరడానికీ, చేరి నిలదొక్కుకోవడానికి సాధారణ స్థాయికంటే అధికంగా తెలివి, కష్టపడే తత్వం అవసరం. అభిరుచితో పాటు కష్టపడే గుణం, పట్టుదల వంటి లక్షణాలుంటే సాధారణ బి.ఎ, బి.కామ్ వంటి చదువుల తోనూ ఐసిడబ్ల్యుఎ, సిఎ వంటి సంక్లిష్ట చదువులు చదివి ఉన్నత స్థాయికి రావచ్చు.

ఇలా ఎన్నో రకాలుగా పెనవేసుకున్న వ్యక్తిత్వపు లక్షణాలూ, అభిరుచులూ, శక్తి సామర్థ్యాలూ, ఆర్థిక వెసులుబాటూ, అవకాశాలు, భవిష్యత్తులో ప్రయోజనాలు, చదువుకి కాలపరిమితిల చిక్కుముడిని విప్పడానికి విద్యా కౌన్సెలింగ్ అత్యవసరం. కానీ అటువంటి సహాయక ఏర్పాట్లు మనకు చాలా తక్కువ. **అటువంటి కౌన్సెలింగ్ సెంటర్లు గనక ప్రొఫెషల్ స్థాయి నాణ్యతతో విద్యార్థులకూ, పెద్దలకూ అందుబాటులో ఉండి సలహా (అన్ని అంశాలూ పరిగణించి, విశ్లేషించి) సూచనలూ ఇవ్వగలిగిననాడు చదువుల కీకారణ్యంలో కనీసం కాలిబాట ఏర్పడుతుంది. చదివే చదువులకూ విలువ ఏర్పడుతుంది.**

పంచాయితీ

సర్వజిత్

"చస్ యెందవగోలని... యెందవగోల... మీ ఏడుపులేనా నన్ను సెప్పనిస్తారా?"

అంతెత్తున లేచాడు బల్లెం బాబూరావు. ఆ అరుపుతో అతని ఎదురుగా నిల్చున్న ఇద్దరు ఆడవాళ్లూ కళ్లు తుడుచుకుని, పమిట చెంగుతో ముక్కు తుడుచుకుని నిశ్శబ్దంగా ఉండిపోయారు.

ఆ ఇద్దరికి అటూ ఇటూ నిల్చున్న వాళ్ల తాలూకు వాళ్లూ ఉలిక్కిపడి నోళ్లు మూసేసుకున్నారు.

అంతగా తమ నాయకుడు బల్లెం బాబూరావుకి కోపంవచ్చినందుకు అతని వెనకాల, అతని ప్రక్కన నిల్చున్న అతని అనుచరులు ఉలిక్కిపడి, ఎదురుగా ఉన్న వాళ్లకేసి కోపంగా చూశారు.

బాబూరావు ఏం చెబుతాడోనని ఆడవాళ్లిద్దరూ ఎదురుచూశారు.

బాబూరావు పాలకపార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నాయకుడు.

నిజానికి అతని స్థాయి ద్వితీయ శ్రేణికి తక్కువే. కానీ, తనకి తను స్థాయి పెంచేసుకుని చిన్న చిన్న పంచాయితీలు చేస్తున్నాడు.

నాలుగు రాళ్ల వెనకేసుకోవడమూ నేర్చుకున్నాడు.

ఈ మధ్యనే అలా రెండు స్థలాలు కూడా ఆక్రమించుకున్నాడు.

మనిషి అంత పొడుగూకాదు. పొట్టీకాదు. కారు నలుపు కాదుగానీ నలుపే.

దీనికి తోడు చెంపలు కలిసిపోయిన గెడ్డం. అప్పుడప్పుడు దాన్ని ట్రిమ్ చేయిస్తుంటాడు.

బాగా గంజిపెట్టిన తెల్లని ఖద్దరు షర్టు, తెల్ల ఫ్యాంటు వేస్తుంటాడు.

కుడి చేతి నాలుగు వ్రేళ్లకీ నాలుగు ఉంగరాలున్నాయి. మెడలో సాయిబాబా బిళ్లతో బంగారు గొలుసు ఈ మధ్యనే చేయించుకున్నాడు.

అతని ఎడమచేతిలో సెల్‌ఫోన్ పావుగంటకోసారి రింగవుతూనే ఉంటుంది.

బిజీ ఏమాత్రం లేకపోయినా బిజీగా ఉన్నట్లు సృష్టించుకోవడం చాలాకాలం క్రిందటే బాబూరావు నేర్చుకున్నాడు. తరచూ అధిష్టానవర్గం నుంచి ఎవరో ఒక నాయకుడు వస్తుంటాడు కనుక పదిమందిని పోగేసుకుని వెళ్లి ఆయన్ని ఘనంగా పూలదండతో సత్కరించి, తనకీ, ఆయనకీ జిందాబాద్‌లు కొట్టించుకుని, ఫోటోలు తీయించుకుని, ఆనక అవి పేపర్లలో వేయించుకోవటమూ బాబూరావుకి చాలా బాగా తెలుసు.

అందుకనే బాబూరావు అతితక్కువ కాలంలో ఇంతపైకి ఎదిగిపోయాడు.

నిజానికి బల్లెం ఇంటిపేరు కాదు. బల్లెంతో ఎదిరించి నిలబడ్డాడని అతనికి 'బల్లెం' ఇంటిపేరుగా, బిరుదుపేరుగా మారిపోయింది. కానీ ఆ సంఘటన ఎప్పుడు, ఎక్కడ జరిగిందో కచ్చితంగా ఎవరికీ తెలీదు.

అయితే జనం అలా చెప్పుకుంటారు.

మొదట్లో బాబూరావే జనానికి తన జనం చేత చెప్పించాడు. ఆ తరువాత జనం చెప్పుకోవడం మొదలెట్టారు.

అంత చరిత్ర గలిగిన బల్లెం బాబూరావు, ఈ పంచాయితీ గురించి ఏం మాట్లాడుతాడా అని అటు అనుచరులు, ఇటు ఎదురుగా ఉన్నవాళ్లు ఎదురు చూడసాగారు.

ఫోను తరువాత ఫోను, అలా సెల్‌ఫోన్‌లో నాలుగుసార్లు మాట్లాడి తరువాత ఎదురుగా దీనాతిదీనంగా ముఖంపెట్టి నిల్చున్న ఆ ఇద్దరు ఆడవాళ్లకేసి చూశాడు బాబూరావు.

గెడ్డం సవరించుకున్నాడు.

ముఖం చిట్లించుకున్నాడు.

జేబురుమాలుతో ముఖం తుడుచుకున్నాడు. మంచి నీళ్లు కావాలన్నట్లు అనుచరులకు సంజ్ఞ చేశాడు.

వాళ్లు అగ్గగ్గలాడుతూ మంచినీళ్లు తెచ్చి ఇచ్చారు.

మంచినీళ్లు తాగాక మళ్లీ గెడ్డం సవరించుకున్నాడు బాబూరావు.

"చెప్పుల షాపులో ముందు ఎవరు పన్జేసేవాళ్లు?" ఇద్దరు ఆడవాళ్లని ఉద్దేశించి బాబూరావు అడిగాడు.

ఈ ప్రశ్న వారం రోజులుగా నలుగుతున్న ఆ పంచాయతీలో బాబూరావు అడగడం ఇది ఆరోసారి.

"నాను సేసేదాన్నండి... సెప్పుల సాపులోను, ఆ పక్కనున్న పింటింగ్ పెస్సులోను, ఆ ఎదురుగ్గా వున్న టీ బంకు కాడ నానే సేసేదాన్నండీ. పొద్దునేల, సాయంతరమేలా..."

"అడిగిందానికి చెప్పు..." బాబూరావు కోపినట్లు అనడంతో చెబుతున్నదాన్ని చటుక్కున ఆపేసింది సన్యాసమ్మ.

"నువ్వెప్పట్నుంచి చేత్తన్నావ్?"

ఎదురుగా ఉన్న మరో మహిళకేసి చూస్తూ అడిగాడు బాబూరావు.

"పోయినెన్నెల వదేనో తారీకునుంచండి" చెప్పింది భూలక్ష్మి ఉరఫ్ బూలచ్చివి.

ఇంతలో సెల్‌ఫోన్ రింగయింది. ఫోన్‌లో మాట్లాడిన తరువాత "ఎన్రోజులు వన్జేశావ్?" మళ్ళీ బూలచ్చిని ఉద్దేశించి అడిగాడు.

"ఇరవైరోజులు వన్జేశానండి. ఇంతలో ఇదొచ్చిందండి... బూలచ్చిమి ఇరవైరోజులు సేసిందిగందా. మరో పదిరోజులు సేసేత్తే నెలజీతం యిచ్చేత్తాం. పస్టునుంచి నువ్వొద్దు వుగానీలే అని చెప్పుల సాపోళ్ళన్నారండి". బూలచ్చివి చెప్పింది.

'అవునా' అన్నట్లు సన్నాసమ్మకేసి చూశాడు బాబూరావు.

"అవునండి... నేనాసాపులో ఏడాది పైగా పాచిపన్జేత్తన్నానండి. సడెన్‌గా మా సెల్లికి పానం బావోలేక పోతే పూరెల్లినానండి. దానికి పెద్దాపరేషన్ సేశారండి. అందుకాలీస్యం అయిపోయిందండి..." సన్నాసమ్మ ఐదోసారి వివరణ ఇచ్చుకుంది.

బాబూరావు కొంచెంసేపు మౌనంగా ఉండిపోయాడు.

పది క్షణాలయ్యాక సన్నాసమ్మ అన్నది. "నాను పస్టుకెల్లానండి సాపుకాడికి. బూలచ్చివి పన్జేత్తేనంటంది... అని సాపోల్లు అన్నారండి. అయ్యా యేడాది నుంచి మీ సాపులోనే పన్జేత్తన్నాను. నావల్ల ఈసవెత్తు తప్పు జరగలేదు. నా పని నాకిప్పిచ్చండి... అన్నానండి. ఆళ్లు సూద్దాం అన్నారండి. యిది రోజూ ఆ వన్లోకెల్లి పోతందండి. మరి నా పని నాకిచ్చెయ్యాలి గదండి?"

నన్నానమ్మ చెప్పిందాంట్లో బాబూరావుకి రీజనింగ్ కనిపించింది.

చెప్పుల షాపువాళ్లు సన్నాసమ్మను కాదని బూలచ్చిమి వైపు ఎందుకు మొగ్గుతున్నారో బాబూరావుకి తేలిగ్గానే అర్థమయ్యింది.

భూలక్ష్మి వయసులో ఉంది. అందుకు తగ్గట్టుగానే చీరా, జాకెట్టు వేసుకుంటుంది. వదులుగా జడవేస్తుంది. కొంచెం వయ్యారాలు పోతుంది.

ఆమె భర్త ఏదో షెడ్డులో పని చేస్తుంటాడు.

సన్నాసమ్మ వయసు మళ్లిన మనిషేమీ కాదు. సన్నగా ఎముకలు కనిపిస్తూ ఉంటుంది. మోకాళ్లు పైకి కట్టే చీర, వదులు జాకెట్టు, నామమాత్రంగ అల్లి ముడిపెట్టిన జుట్టు... చూడగానే భూలక్ష్మిలాగ ఆకర్షించదు.

ఆమె భర్త రూపాయి సంపాదించి, రూపాయిన్నర తాగుతాడు...

"అందుకని బూలచ్చిని బూతులు తిడతావా? యుద్ధమా. జుట్టూ జుట్లూ అట్టుకుని రోడ్డుమీదకు బడతారా? మిమ్మల్ని జూసి మీ మొగుళ్లు రోడ్డుమీద యీరంగం యేత్తారా? బుద్ధిలేదు..." బాబూరావు అరిచాడు.

ఆడవాళ్లిద్దరూ, వాళ్ల వెనకాల ఉన్న భర్తలిద్దరు తలలు వంచుకున్నారు.

గత వారం రోజులుగా ఈ వ్యవహారం బల్లెం బాబూరావు ముందు నలుగుతోంది.

నిజానికి ఈ కేసు విషయంలో అతనికే మాత్రం ఆసక్తిలేదు.

ఎందుకంటే ఈ పంచాయితీవల్ల ఎటునుంచీ ఏ విధమైన ప్రయోజనమూ లేదని అతనికి ముందే తెలుసు.

కేవలం పాప్యులారిటీ కోసం మాత్రమే వాళ్ల తగవు పరిష్కరించడానికి 'సరే' అన్నాడు.

పాచి పనిచేసే పని మనుషుల తగాదా బల్లెం బాబూరావు ముందుకు వెళ్లిందనగానే చెప్పుల షాపువాళ్లు మిన్నకుండి పోయారు.

ఎవరు పని చేయడానికి వస్తే వాళ్లనే పనిలో పెట్టుకుందామనుకున్నారు.

ప్రొద్దుట వస్తే సాయంత్రమని, సాయంత్రంవస్తే మర్నాడు ఉదయమనీ... బాబూరావుకి వీలులేక ఒకటి రెండురోజులూ... ఇలా మొత్తం మీద సన్నాసమ్మా, బూలచ్చిమిలు వారం రోజులుగా అతని చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

"వుప్పుడు... సన్నాసమ్మ ఊరెల్లింది. మళ్లీ వచ్చింది. వచ్చినప్పుడు ఆమె పని ఆమెకిచ్చెయ్యాలి గదా?" బూలచ్చిమిని ఉద్దేశించి అడిగాడు బాబూరావు.

"అవుననుకోండి... మరి సాపోళ్లు నన్నే పన్జెయ్యమంటున్నారండి". బూలచ్చిమి సమాధానం చెప్పింది.

"నాను కూసింత తప్పుసెయ్యలేదు. రెండేళ్ల నుంచీ పన్జేత్తన్నదాన్ని గందా! నా పని నాకిప్పించాలి గదండీ?" సన్నాసమ్మ అన్నది.

బాబూరావు గతంలో అడిగిన ప్రశ్నలే మళ్ళీ అడిగాడు.

వాళ్ళిద్దరూ గతంలో చెప్పిన సమాధానమే మళ్లీమళ్లీ చెప్పారు.

అతనికి కార్మిక హక్కులు, రూల్సు తెలియవుగాక తెలియవు.

ఎవరిని కాదనాలో, ఎవరిని అవుననాలో అతనికి తోచలేదు.

ఈ పనికిరాని తగాదాని తన దగ్గరికి తీసుకువచ్చిన పొట్టిశీను అనబడే అనుచరుణ్ణి తిట్టిపోశాడు.

పొట్టిశీనుకి ఓ చెల్లెలుంది. పైసా సంపాదన లేకుండా ఆడపడుచు ఇంట్లో తిని కూర్చొంటోందని అతని భార్య రోజూ పోరుతోంది.

ఆమె అత్తను ఏనాడో ఇంటి నుంచి వెళ్లగొట్టింది.

ఈ పోరు భరించలేక శీను తన నాయకుడు బాబూరావుకి చెప్పుకున్నాడు. ఐదో తరగతికూడా చదువుకోని చెల్లెల్ని ఏంచెయ్యాలో తెలీక అతని దగ్గర బాధపడి పోయాడు.

అంచేత బూలచ్చివి, సన్నాసమ్మ తగాదాని వారంరోజులు నాన్చి నాన్చి తీర్పు చెప్పాడు బాబూరావు.

"వో పన్జెయ్యండి... కొన్నాళ్లపాటు మీ ఇద్దరూ ఆపన్లోకి ఎలబోకండి... కొన్నాళ్లు పోయాక ఆ షాపోళ్ళతో మాట్లాడి యేదో వొకటి సేత్తా... ఇక కాట్లాడుకోక యెల్లండి..." అనేసి వాళ్లకు మరో మాటకు అవకాశం ఇవ్వకుండా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఆటోఎక్కి వెళ్లిపోయాడు బాబూరావు.

భూలక్ష్మి, సన్నాసమ్మ అవాక్క య్యారు ఆ మాటకి. మరునాడు ఉదయం రోడ్డు మీద బూలచ్చివికి ఎదురుపడింది సన్నాసమ్మ.

"ఆ షావులో వని నన్ను సేసుకోనియ్యిలేదు... నీకు దక్కలేదు... మధ్యలో ఆ పొట్టి శీనుగాడి సెల్లెలు కొట్టేసింది" నిష్ఠూరంగా అనేసి వెళ్లిపోయింది బూలచ్చిమి.

"ఆ యెదవ పంచాయితీతో వొరిగిందేంటీ" మనసులో అనుకుందామను కున్నమాట పైకే అనేసి గుడ్లనీరు కుక్కుకుంది సన్నాసమ్మ.

ఇప్పటి పంచాయితీలు పట్టణా లను ఏలే మాఫియా భాయిల చేతిలో ఇష్టా రాజ్యాలయ్యాయి కదా! ఎవరికి వొరిగినా వొరక్కపోయినా...బల్లెం బాబూరావులాంటివారు తమ బహుళార్థ ప్రయోజనాలు చూసుకుంటారు. ఇక్కడకూడా అదే జరిగింది.

బల్లెం బాబూరావు అనుచరుడు పొట్టిశీనుగాడి చెల్లెలు ఇప్పుడు ఆ షాపులకు వెళ్లేటప్పుడు-వచ్చేటప్పుడూ వయా బల్లెం బాబూరావు ఇల్లయ్యింది.

❖

ప్రజాస్వామ్యానికి గ్రహణం



అంపశయ్య నవీన్

"టోనీబ్లెయిర్ మళ్ళీ గెలవడమేమిటిసార్?"

"జార్జిబుష్ కూడా గెల్చాడుగా"

"అదే సార్... యుద్ధ ఖైదీలుగా ప్రపంచన్యాయస్థానం ముందు నిలబెట్టాల్సిన వీళ్ళను ఆ దేశాల ప్రజలు గెలిపించడమేమిటి?"

"అదేకదా పెద్ద ట్రాజెడీ..."

"ఇంగ్లాండ్‌ను ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లని చెబుతారుకదా... ప్రపంచంలో అత్యంత పరిపక్వమైన ప్రజాస్వామ్యం ఇంగ్లాండ్‌లో ఉందని నేననుకుంటుండేవాణ్ణి..."

"ఎందుకలా అనుకున్నావు? అలా అనుకోమని ఎవరు చెప్పారు?"

"అక్కడి ప్రజలు బాగా చదువుకున్నవాళ్ళనీ, మంచీ చెడు ఆలోచించి విజ్ఞతతో కూడిన నిర్ణయాలు తీసుకుంటారని ప్రజాస్వామ్యవాదులు చెప్పగా విన్నాను."

"అటు అమెరికాలో జరిగిన ఎన్నికల ఫలితాలనూ, ఇటు ఇంగ్లాండ్‌లో జరిగిన ఎన్నికల ఫలితాలనూ చూశాక నాకు ఆ దేశాల్లో ఉన్నది ప్రజాస్వామ్యమనిపించడం లేదు".

"మరేమిటంటారు?"

"ప్రజాస్వామ్యం పేరుతో జరుగుతున్న మోసమంటాను. లేకపోతే ఇరాక్ మీద యుద్ధం చేసి, ఆ దేశాన్ని సర్వనాశనం చేసిన అమెరికా ప్రెసిడెంట్ బుష్‌ను అమెరికా ప్రజలు గెలిపించడమేమిటి? యుక్తాయుక్త విచక్షణను మరిచిపోయి టోనీబ్లెయిర్‌ను గుడ్డిగా జార్జిబుష్‌ను సమర్థించడమేమిటి? వీళ్ళిద్దరూ అగ్రరాజ్యాధినేతలు. యునైటెడ్ నేషన్స్‌ను కూడా పూర్తిగా బేఖాతర్ చేసి ఇరాక్ మీదకు దండెత్తారు. కరడుగట్టిన నియంతల్లా ప్రవర్తించిన వీళ్ళిద్దర్నీ మొన్న జరిగిన ఎన్నికల్లో ప్రజలు భూస్థాపితం చేస్తారనుకున్నాం... కానీ అలా జరగలేదు. ఈ ఇద్దరు నేతల్ని ప్రజలు మళ్ళీ గద్దెమీద కూర్చోబెట్టారు"

"అలా ఎందుకు జరిగిందంటారు?"

"ప్రజాస్వామ్యంలో ఉన్న లోపమే ఇందుకు కారణం... సగం కంటె ఎక్కువమంది అంటే మెజారిటీ ఎవర్ని వరిస్తే వాళ్ళే గద్దెమీదకెక్కి కూర్చుంటారు. కొన్నిసార్లు సగం మంది కూడా మిమ్మల్ని సపోర్టు చెయ్యకపోవచ్చు. ఉదాహరణకు ముగ్గురు అభ్యర్థులు పోటీచేశారనుకోండి మొత్తం పోలైన ఓట్లలో ఒకరికి 34 శాతం ఓట్లు మిగతా ఇద్దరికి చెరి 33 శాతం ఓట్లొచ్చాయనుకోండి 34 శాతం ఓట్లొచ్చిన వాడు గెలుస్తాడు. అతనికి వ్యతిరేకంగా 66 శాతం మంది ప్రజలు ఓట్లేశారన్న విషయాన్ని మనం మరచిపోతుంటాం. 66 శాతం మంది ప్రజల నిర్ణయాన్ని తుంగలో తొక్కేసి కేవలం 34 శాతం మంది ప్రజల అభిప్రాయానికే మనం పట్టం కడ్తున్నామన్నమాట."

"నిజమేనండోయ్"

"యూరోప్‌లోని చాలా దేశాల్లో ఈ పద్ధతి లేదు. దేశాధ్యక్షుడులాంటి ముఖ్య పదవికి జరిగే ఎన్నికలో ముగ్గురో నల్గురో అభ్యర్థులు పోటీ చేశారనుకోండి. అప్పుడు అందరికంటె ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని గెలిచినట్లుగా ప్రకటించరు. మొత్తం పోలైన ఓట్లలో సగం కంటె ఎక్కువ ఓట్లొచ్చినప్పుడే ఆ అభ్యర్థిని గెలిచినట్లుగా ప్రకటిస్తారు"

"పోటీ చేసిన ముగ్గురిలోనో, నల్గురిలోనో ఎవరికీ మొత్తం పోలైన ఓట్లలో సగం కంటె అంటే 50 శాతం కంటె ఎక్కువ ఓట్లు రాలేదనుకోండి... అప్పుడేం చేస్తారు?"

"అప్పుడు అందరికంటె ఎక్కువ ఓట్లొచ్చిన మొదటి ఇద్దరు అభ్యర్థులను మాత్రమే ఎన్నికల్లో ఉండనిచ్చి వాళ్ళిద్దరికీ మళ్ళీ ఎన్నికల్ని నిర్వహిస్తారు. అందులో యాభైశాతం కంటె ఎక్కు ఓట్లు తెచ్చుకున్న అభ్యర్థిని గెలిచినట్టుగా ప్రకటిస్తారు"

"దీనివల్ల కల్గే లాభమేమిటి?"

"లాభమేమిటో స్పష్టంగా తెలుస్తూనే ఉందికదా... ఓటర్లలో సగం కంటె ఎక్కువమంది బలపరచిన అభ్యర్థి మాత్రమే ఎన్నికవుతాడు. ప్రజాస్వామ్యమంటేనే మెజార్టీపాలన కాబట్టి ఇక్కడ కనీసం అదన్నా అమలు జరుగుతున్నది. మొత్తం పోలైన ఓట్లలో కేవలం 20 శాతం, 30 శాతం ఓట్లను తెచ్చుకొని గెలిచే పరిస్థితి ఇక్కడ లేదు".

"నాకో సందేహం... మెజార్టీ అభిప్రాయమే మంచి అభిప్రాయం, న్యాయసమ్మతమైన అభిప్రాయమని అనుకోవాలి? ఒక్కొక్క సారి మెజారిటీ అభిప్రాయం కూడా తప్పుడు అభిప్రాయం కావచ్చుకదా..."

"అవును... మెజార్టీ అభిప్రాయమే కరెక్ట్ అభిప్రాయమని నిర్ధారించడానికి వీల్లేదు. పూర్వం ఏథెన్స్ నగరంలో సోక్రటీసుకు మరణశిక్ష విధించాలని మెజార్టీయే నిర్ణయించింది. సోక్రటీసు చేసిన నేరమేమీలేదు. ఆలోచించండి, ప్రశ్నించండి... దేన్నీ గుడ్డిగా నమ్మకండి అని ప్రజలకు చెప్పాడు. సోక్రటీసు శిష్యుడైన ప్లేటో ప్రజాస్వామ్యాన్ని అసహ్యించుకున్నాడు. ఎందుకంటె ఏమీ తెలియని మూర్ఖుల నిర్ణయం కూడా కొన్నిసార్లు నెగ్గుతుంది. విజ్ఞులు రాజకీయాలంటే అసహ్యించుకుంటూ ఇంట్లోనే కూర్చొని ఓట్లెయ్యడానికి రారు. అన్నీ తెలిసిన వాళ్ళు నోర్లు మూసుకోవడం, ఏమీ తెలియని వాళ్ళు పరిపాలించడం ప్రజాస్వామ్యంలో జరుగుతుంటుంది. అందువల్లనే టోనీబ్లెయిర్, జార్జిబుష్ లాంటి వాళ్ళు గద్దెనెక్కి మన నెత్తిమీద కూర్చొని మన జీవనవిధానాన్ని ప్రభావితం చేస్తుంటారు"

"దీనికి పరిష్కారమేమిటంటారు. ప్రజాస్వామ్యాన్ని తీసిపారేద్దామా?"

"ప్రజాస్వామ్యాన్ని తీసి పారేయడం కూడా అభిలషణీయం కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం లేదనే చెప్పాలి. చెయ్యాల్సిందేమిటంటే ప్రజాస్వామ్యాన్ని సంస్కరించుకోవాలి. ముఖ్యంగా ఎన్నికల చట్టాల్లో మార్పులు తీసుకురావాలి. నేరచరితుల్ని ఎన్నికల్లో పోటీ చెయ్యనియ్యక పోవడం, యాభైశాతం కంటె ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థినే గెలిచినట్టుగా ప్రకటించడం, అభ్యర్థులు కాకుండా పార్టీలకొచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి ఆయా పార్టీల అభ్యర్థుల సంఖ్యను నిర్ణయించడం, ఎన్నికల ఖర్చును అభ్యర్థులు కాకుండా ప్రభుత్వమే భరించడంలాంటి కొన్ని మార్పులు చేస్తే మన ప్రజాస్వామ్యం కొంతైనా బాగుపడొచ్చు" ❖

దేశభక్తి

జె.పురుషోత్తం

విదర్భ రాజాస్థానం సైనికులు, భటులు, అంగరక్షకులు, ప్రజలతో నిండివుంది. అందరి మొహాల్లోనూ ఆనందం, ఉత్సాహం కనిపిస్తోంది. కారణం విదర్భ రాజు శత్రురాజ్యమైన కళింగ రాజ్యాన్ని ఓడించాడు. ఆ యుద్ధంలో ధైర్య సాహసాలు ప్రదర్శించి శత్రువులను చీల్చిచెండాడిన సైనికుల్ని పేరుపేరున పిల్చి కానుకలు ఇచ్చి సన్మానిస్తున్నారు. ఆ సన్మానాన్ని అందుకుని ఆనందంగా ఇళ్లకు వెళ్లసాగారు సైనికులు.

అలా సన్మానం పొందిన వారిలో విక్రముడు, శంభుడు కూడా వున్నారు. వీరు మహారాజు తమకు బహూకరించిన వజ్ర వైడూర్యాలు, హారాలు మూటగట్టుకుని ఎంతో సంతోషంగా రాజాస్థానం నుండి బయటికి వచ్చారు. కాసేపు అక్కడే నిలబడి సన్మానం కబుర్లు చెప్పుకున్నారు. తమ స్వంత గ్రామమైన చంద్రపురికి వెళ్లాలనుకున్నారు. అందుకు ఒక గుర్రపు బండిని బాడుగకి మాట్లాడుకుని ఎక్కి కూర్చున్నారు. రౌతు బండిని చంద్రపురి గ్రామంవైపు తోలసాగాడు.

ఇంతలో విక్రముడు బిగ్గరగా గుర్రపు బండి నడిపేవానితో "ఏయ్! మేం ఎవరమో తెలుసా? కళింగ రాజ్యంతో యుద్ధంలో పోరాడిన సైనికులం. శత్రువుల్ని ఏ కీలుకాకీలు విరిచి కాకులకు, గద్దలకు వేసిన ధీరులం. మేం చేసిన పోరాటానికి ప్రతిఫలంగా సన్మానం కూడా పొందాం. మాలాంటి దేశభక్తులు ఈ రాజ్యానికి ఎంతో అవసరం" అన్నాడు గర్వంగా.

శంభుడు కూడా విక్రమునికి వంతపాడుతూ "మాలాంటి పోరాట యోధులు వుండబట్టే ఈ రాజ్యం ఇలా సుభిక్షంగా వుంది. మమ్మల్ని స్ఫూర్తిగా తీసుకుని నువ్వు కూడా దేశభక్తి పెంపొందించుకో. దేశం కోసం దేన్నైనా త్యాగం చేయడానికి సిద్ధంగా వుండాలి. దేశాన్ని కాపాడే వాడే అసలుసిసలైన పౌరుడని తెలుసుకో..." అన్నాడు. ఏదో అనుమానం వచ్చి బండి నడిపే వాడిని నిశితంగా పరిశీలించి "అరే! నీకు ఓ కాలు, చెయ్యి లేదే? ఖర్మ... ఖర్మ... నీలాంటి వారుంటే ఈ రాజ్యం ఎప్పుడో శత్రువుల వశం అయ్యేది. మాలాంటి వారు వుండబట్టి సరిపోయింది. అయినా నీ కాలు, చెయ్యి ఎలా పోయాయి?" అని అడిగాడు.

అందుకు బండి నడిపేవ్యక్తి "అయ్యా! నా పేరు రాయన్న. ఒకప్పుడు నేను కూడా మీలా విదర్భ రాజ్య సైనికుణ్ణే. నేను కూడా కళింగ యుద్ధంలో పాల్గొన్నాను. శత్రువులతో పోరాడుతూ కాలు, చెయ్యి పోగొట్టుకున్నాను. నా దేశం కోసం కాలు, చెయ్యి పోయినందుకు నేను ఏమాత్రం బాధ పడడంలేదు సరి కదా ఆనందంగా వుంది. జన్మభూమి కోసం ఆ మాత్రం త్యాగం చేయడం నా కర్తవ్యం. కాలు, చెయ్యి పోయినా మరొకరిపై ఆధారపడకుండా నేనే గుర్రపు బండిని నడుపుకుంటూ ధనం సంపాదిస్తున్నాను. దాంతోనే నా భార్యా బిడ్డలను పోషిస్తున్నాను. ఇకపోతే రాజుగారు ఇచ్చే సన్మానం నాకు అవసరం లేదు. దేశం కోసం పోరాడి ప్రతిఫలం పొందడం నాకిష్టం లేదు. ప్రతిఫలాన్ని ఆశించి నేను శత్రువుతో పోరాడలేదు" అన్నాడు.

అంతే! రాయన్న మాటలకు విక్రముడు, శంభుడు నోరు తెరిస్తే ఒట్టు. అప్పుడు వారికి తామ చేసిన పొరపాటు ఏంటో తెలిసొచ్చింది.

★



బాలనేస్తాలు

15.5.05 కు సరైన సమాధానం రాసినవారు

ఎస్.మహాలక్ష్మి, 9వ తరగతి, శ్రీవివేకానంద పబ్లిక్ స్కూల్, బాడంగి, విజయనగరం. మావుడూరు భార్గవ, 5వ తరగతి, సాగవకోట, శ్రీకాకుళం. ఎం.అలేఖ్య, 5వ తరగతి, ప్రతిభా పబ్లిక్ స్కూల్, కల్లూరు, ఖమ్మం. ఆర్.రంజాన్, టి.ఎం.డి.నాసిర్, అనిల్, ఎం.రమేష్, ఎం.తిమ్మప్ప, ఎం.బాలాజీ, ఎం.అనుదీప్, యు.రాజశేఖర్, కె.విజయకుమార్, ఎం.అమరేష్, యు.దేవిక, జి.ఉమామహేశ్వరి, ఎం.తాయిలక్ష్మి పి.విజయమాధవి, ఎ.సుమలత, యు.ఈరన్న, వి.మంజునాథ్, యు.భీమలింగ, జి.సునంద పవన్, కె.మానిక్‌బాష, యు.నాసిర్, కె.మజార్‌హుస్సేన్, బి.శ్రీనివాసులు, జి.నాగేష్, 10వ తరగతి, ఎం.షబ్బీర్ హుస్సేన్, 9వ తరగతి, శ్రీవేణు విద్యాలయం, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు.

వీరి వీరి గుమ్మడిపండు... వీరి పేరేమి?

22.5.05 సమాధానం:
పుచ్చలపల్లి సుందరయ్య

హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినవారెవరో గుర్తుపట్టేశారా! అర్రే పిల్లలూ! మీరు కాకపోతే మరెవరు గుర్తుపడతారులే. ఈయన మన దేశ ప్రధానిగా చేశారు. అంతేకాదర్రా! మనదేశ మరో ప్రధానికి తండ్రికూడా. ఇంతే కాదు. మనదేశ మరో ప్రధానికి తాతకూడా. మరైతే ఫొటోలోని వ్యక్తి పేరేంటో కార్డు మీద రాసి పంపండి. సరైన సమాధానమైతే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. ఓకేనా. ఈ పని ఇవాళే ఇప్పుడే చెయ్యాలని తెలుసుకదా.

మా చిరునామా:
వీరి వీరి గుమ్మడిపండు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.



కోసిన ముక్క ఏదబ్బా!

హాయ్ ఫ్రెండ్స్! ఇది వేసవికాలం కదా. వేసవికాలం అంటే మనకు వెంటనే గుర్తొచ్చేది మామిడికాయలు. అందుకనే మీకోసం ఓ మామిడికాయను తీసుకొచ్చాం. కాకపోతే ఓ పిడుగు చాకుతో ఆ మామిడికాయ మధ్యలో ఒక ముక్క కోసుకుని తినేశాడు. అదేనర్రా... డాట్స్‌లో వుందే... అదన్నమాట ఆ ముక్క. ఆ ముక్క నీడ ఎ బి సి డి ఇ లలో వుంది. అదేంటనేది మీరు కనిపెట్టి చెప్పాలి. తెలీకపోతే మాత్రం సమాధానం చూడండే.

జవాబు: బి

రంగులు వేసెయ్యండి

ఈ బొమ్మలో ఎవరో వున్నారు. వారెవరో తెలియాలంటే... చుక్కలు వున్న చోట రంగులు అద్ది చూడండి. ఇట్టే తెలిసిపోతుంది. (బొమ్మ పై భాగంలోను, కింది భాగంలోను చుక్కలున్న చోట ఆకుపచ్చ, మధ్యలో చుక్కలున్న చోట ఇటుకరంగు అద్దాలి.)



చిన్నారి చిత్రకారులు

ఎస్. శ్రావణి, 6వ తరగతి,
ప్రగతి బాల విద్యాలయం, తాడేపల్లి, గుంటూరు.

జె.సాయి, 8వ తరగతి,
గుడ్ సిటిజన్స్ హైస్కూల్, ఎల్‌బినగర్, రంగారెడ్డి.

కె.సాయికృష్ణ గౌడ్, 7వ తరగతి,
రిషి హైస్కూల్, సంగారెడ్డి, మెదక్.

మొక్కజొన్నను చేరే మార్గం ఏది?

అనగనగా ఓ కాకమ్మ. అదిగో బొమ్మలో కనిపిస్తోందే. అదే కాకమ్మంటే. దానికి చాలా ఆకలిగా వుంది. పాపం అలా వెతుకుతూ వుంటే ఎప్పటికో ఒక మొక్కజొన్న కంకి కనిపించింది. కానీ దాని దగ్గరకు వెళ్లడానికే బోలెడన్ని అడ్డంకులు వున్నాయి. మరి మొక్కజొన్నను చేరే మార్గం ఏదో కాస్త కనిపెట్టి కాకమ్మకు చెప్పొచ్చుకదా.

ఆకులు ఎన్నున్నాయో!

హాయ్ నేస్తాలూ! కింద బొమ్మలో ఒక కొమ్మ వుందికదా. దాన్ని చూస్తే మీకేమనిపిస్తోంది? 'అబ్బ! కొమ్మకు ఎన్ని ఆకులో. ఎంత అందంగా వుందో' అనే కదా. మరి ఏమనుకుంటున్నారు! ఆర్టిస్ట్ అంకుల్ దాన్ని కేవలం మీకోసమే వేసి పంపారు. ఎందుకో తెలుసా! మీరు ఆ కొమ్మకు ఎన్ని ఆకులు వున్నాయో చిటికెలో చెప్పాలంట.

ఇంక ఆలస్యం ఎందుకు? వెంటనే జాగ్రత్తగా పెన్నో పెన్సిలో తీసుకుని ఒక్కో ఆకుకు అంకెలు వేసుకుంటూ లెక్కించండి. ఆ అంకుల్ చెప్పమన్నట్టే చిటికెలో ఆకులెన్నో చెప్పెయ్యొచ్చు. ఓకేనా! అన్నట్టు మీ జవాబు సరైనదో కాదో తెలుసుకోవాలంటే పేజీ తిరగేసి చూడండే.

జవాబు: ఇరవైఆరు ఆకులు

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

వసపిట్ట

"ఈ అమ్మాయి అందరికన్నా బాగా మాట్లాడు తుంది. ఈమె గురించి మాట్లాడటం ఎవరికైనా కాస్త ఇబ్బంది అనిపించే విషయం" విజయ్‌లెలె అన్నారు.

పూణెలో ఆడిటోరియం క్రిక్కిరిసిపోయింది.

ఎంతో మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. ఉత్తమ వక్తగా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన మానిక్ చంద్రచూడ్ అభినందన సభ అట్టహాసంగా ప్రారంభమైంది.

ఎంతో మంది ప్రముఖులు వేదికను అలంకరించారు. పదహారేళ్ల మానిక్ దర్జాగా కుర్చీలో కూర్చుని ఉంది.

మహారాష్ట్ర హెరాల్డ్ పత్రికా సంపాదకులు విజయ్‌లెలె ముఖ్య అతిథిగా విచ్చేశారు. మానిక్ చంద్రచూడ్ గూర్చి ఆమె ఎదుగుదల గూర్చి ఆయనకు చిన్నతనం నుంచి తెలుసు. ఆయన్ని ఆమె గురువుగా కూడా భావిస్తుంది. అందుకే నిర్వాహకులు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని ముందుకు వచ్చినప్పుడు లెలె పేరు ఆమె ప్రతిపాదించింది. ఆ ప్రాంతంలో విశిష్టమైన వ్యక్తిగా ప్రాచుర్యం కలిగిన ప్రముఖునిగా గుర్తింపు ఉండటంతో వారు కూడా అంగీకరించారు.

అందరూ మాట్లాడిన తర్వాత విజయ్‌లెలె తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "ఏ అంశం మీదనైనా అనర్గళంగా మాట్లాడేవారు కొందరుంటారు. చక్కటి వాగ్ధాటి. ఉచ్చారణ వీటితోపాటు మాట్లాడే భాషపై పట్టు ఇవన్నీ వారి ఉపన్యాసాన్ని ఆసక్తిగా మారుస్తాయి. అదే వ్యక్తులను వేదికపైకి రమ్మని పిలిస్తే రెండుముక్కలు మాట్లాడటానికి కూడా తడబడిపోతుంటారు. దీనినే స్టేజిఫియర్ అంటారు. ఇటువంటి పదానికి అర్థం తెలియని వ్యక్తి మానిక్ చంద్రచూడ్!" అన్నారు.

వచ్చినవారు లెలే మాటలను విని మానిక్ వైపు ఆరాధనగా చూశారు. కొంతమంది బాలికలైతే ఆమె వద్ద నుంచి ఆటోగ్రాఫ్‌లు తీసుకోవడానికి సిద్ధపడుతున్నారు.

"ఎంతో బాగా మాట్లాడుతూ ఎంతోమంది ప్రముఖుల ప్రశంసలు... అభినందనలు... అవార్డులు పొందిన ఈ బాలిక గూర్చి మాట్లాడటం ఎవరికైనా కష్టమైన పనే. నిజంగా ఇలా మాట్లాడగలిగే అవకాశం రావడం కూడా అదృష్టంగానే భావిస్తున్నాను" అన్నారు.

తర్వాత పూణే పట్టణంలో ప్రముఖులు మానిక్ చంద్రచూడ్‌ను అభినందిస్తూ ప్రసంగించారు. మాట్లాడే విషయంలో చక్కని ప్రావీణ్యాన్ని సంపాదించిన ఆమె గొప్పతనాన్ని మెచ్చుకున్నారు.

అనంతరం పట్టణ ప్రముఖులు మానిక్‌ను సన్మానించారు. అభినందనలతో ముంచెత్తారు. తనకు జరిగిన అభినందన సభకు ఆమె కృతజ్ఞతలు తెలియజేసింది. తన విజయం వెనుక ఎంతోమంది కృషి, పట్టుదల, ప్రోత్సాహం ఉందని వినయంగా చెప్పింది.

* * *

మానిక్ చంద్రచూడ్ 2000 సంవత్సరంలో పూణేలో పదవ తరగతి చదువుతుండేది.

చిన్నతనం నుంచి వివిధ విషయాలపై మాట్లాడటానికి ఆమె ఎంతో ఉత్సాహాన్ని చూపించేది. హైస్కూలు స్థాయిలో ఎప్పుడు డిబేటింగ్ జరిగినా ఆమె తప్పనిసరిగా బహుమతిని సొంతం చేసుకునేది.

ఏ విషయంపై మాట్లాడాలన్నా విషయానికి సంబంధించి పూర్తి వివరాలు సేకరించేది. విశ్లేషణలు, గణాంకాలతో ఆమె వివరిస్తూ ఆసక్తిదాయకంగా, ఎదుటివారిని ఆకట్టుకొనేలా చెప్పగలిగేది. పరిసర ప్రాంతాల్లో ఎక్కడ ఎటువంటి పోటీలు జరుగుతున్నా ఇంట్లోవారు, పాఠశాల యాజమాన్యం ఆమెను ప్రోత్సహించి పోటీలకు పంపేవారు. వారి నమ్మకాన్ని ఎప్పుడూ పోగొట్టుకోకుండా ఏ పోటీలకు వెళ్లినా బహుమతులతోనే తిరిగి వచ్చేది.

ప్రపంచవ్యాప్తంగా బాగా మాట్లాడగలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించే సంస్థలు ఉన్నాయన్న విషయం అంతవరకూ ఆమెకు తెలీదు. అటువంటి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నట్లయితే మంచి గుర్తింపు వస్తుందని అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు లభిస్తాయని తెలిపారు.

మానిక్ చంద్రచూడ్ అందుకు అనుగుణంగా ప్రయత్నాలను ప్రారంభించింది. అన్వేషణ మొదలుపెట్టింది.

ఇంగ్లీషు స్పీకింగ్ యూనియన్ (ఇ.ఎస్.యు) అనే సంస్థ ఇందుకు ప్రయత్నాలను చేస్తోంది. ఇది ఒక స్వచ్ఛంద సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థకు అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయి. కామన్వెల్త్ దేశాలు, అమెరికా మధ్య సోదరభావం పెంపొందించడానికి ఈ సంస్థ కృషి చేస్తోంది. భారతదేశంలో ఢిల్లీ, కోల్‌కతా, తిరువనంతపురం, పూణె, ముంబాయి, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో బ్రాంచీలు ఉన్నాయి. చంద్రచూడ్ పూణేలో ఉండటం, అదే ప్రాంతంలో ఈ అనుబంధ సంస్థ ఉండటంతో వివిధ విషయాలను తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడింది. ఉపన్యాసానికి సంబంధించిన పోటీ వివరాలను ఆమె తెలుసుకుంది.

ఈ పోటీలో 16-20 సంవత్సరాలు మధ్య వయసు కలిగిన యువతీ యువకులు పాల్గొనడానికి అవకాశం ఉంటుంది. ఈ పోటీలో పాల్గొనేవారి మాతృభాష ఏదైనా పర్వాలేదు. ఇంగ్లీషు మాత్రం కాకూడదు. ఈ నిబంధనలు తెలుసుకున్న తర్వాత తాను కూడా పోటీల్లో పాల్గొనాలని మానిక్ చంద్రచూడ్ నిర్ణయించుకుంది.

దరఖాస్తు చేసుకుంది.

ఈ పోటీల్లో నలభై దేశాలకు చెందిన 60 మంది ఇదే విధంగా దరఖాస్తులు చేసుకున్నారు.

మొదట దరఖాస్తుదారులందరినీ నాలుగు గ్రూపులుగా చేశారు. వారు ఏ విషయంపై మాట్లాడాలో ఒక్కొక్క గ్రూపునకు ఒక్కో అంశాన్ని ఇస్తారు. దీనిపై వారు ఉపన్యాసం చెప్పవలసి ఉంటుంది. ఇచ్చిన అంశాన్ని ఎంత వెరైటీగా, అర్థవంతంగా ప్రెజెంటు చేస్తారన్న విషయంపై

విజయం ఆధారపడి ఉంటుంది. ఈ అంశాన్ని అభ్యర్థులందరూ పూర్తిగా అర్థం చేసుకున్నారా లేదా అనే విషయాన్ని కూడా పోటీ నిర్వాహకులు పరిశీలిస్తారు.

మానిక్ చంద్రచూడ్ ఈ పోటీలలో ఎలాగైనా విజయం సాధించాలని పట్టుదలగా కృషి చేసింది. పోటీలు దాదాపు వారం రోజులపాటు జరిగాయి. వివిధ అంశాలలో అభ్యర్థుల సామర్థ్యాలను అంచనా వేయడానికి నిర్వాహకులు రకరకాల ప్రయత్నాలు చేశారు. ఈ పోటీలకు హాజరైన మానిక్, భాషలో పట్టు సంపాదించడంతో బాటు విషయాన్ని ఎంత చక్కగా చెప్పాలన్న విషయంలో ఎక్కువ ప్రాక్టీసు చేసింది.

తొలి విడత పోటీలు ఇ.ఎస్.యు సంస్థకు చెందిన ప్రధాన కార్యాలయం డార్ట్‌మౌత్ హౌస్‌లో జరిగాయి. అందులో కొంతమందిని ప్రాథమికంగా ఎంపిక చేశారు. కనీసస్థాయి లేనివారిని వెనక్కి పంపించి వేశారు. మొదటి విడతలో ఎన్నికైన వారిలో మానిక్ కూడా ఉంది. తర్వాత ఫైనల్ పోటీలు ఇంగ్లండులో యునైటెడ్ స్టేట్స్ రాయబారి కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఫైనల్ పోటీలు జరిగిన సమయంలో మానిక్ కాస్త టెన్షన్‌గా ఫీలు అయింది. పదహారేళ్ల వయసులో దేశం కాని దేశంలో ప్రసంగ పోటీలో పాల్గొనడం ఆమెకు ఒకింత ఒత్తిడి కల్గించింది. అయినా విజయం సాధించాలి. అందరిలో ప్రత్యేక గుర్తింపు పొందాలి. భారతదేశానికి తన మాతృభూమి పూణేకు పేరు తీసుకురావాలని దృఢంగా నిర్ణయించుకుంది.

ఫైనల్ పోటీల్లో ఒకొక్కరికి అయిదు నిమిషాలు మాత్రమే సమయాన్ని కేటాయించారు. ఒకొక్కరికీ ఒక్కో అంశాన్ని ఇచ్చారు. "డబ్బు ఈ ప్రపంచాన్ని తనచుట్టూ తిరిగేలా చేస్తోంది" అనే విషయాన్ని మానిక్ చంద్రచూడ్‌కి కేటా యించారు. ఇందుకోసం ప్రిపరేషన్‌కు కొంత సమయాన్ని ఇచ్చారు. ఆ సమయంలో డబ్బుఅనే విషయం ప్రపంచాన్ని ఎంతటి ప్రభావానికి గురిచేస్తుందోనన్న విషయం గూర్చి ఆలోచించింది. ఎంతో విస్తృతమైన ఆ విషయం గూర్చి కేవలం అయిదు నిమిషాల్లో అర్థవంతంగా ఆకర్షణీయం గా ఆకట్టుకొనేలా ఉపన్యాసం ఎలా చెప్పాలన్న విషయం మొదట ఆమెకు అర్థం కాలేదు. ఇందుకు గాను అకిర కురోసావా అనే వ్యక్తి దర్శకత్వం వహించిన 'రోషోమాన్' అనే సినిమా ఆధారంగా తాను మాట్లాడవలసిన విషయానికి సంబంధించి స్క్రిప్టును తయారుచేసుకుంది. ఆ సినిమాలో దర్శకుడు డబ్బు ఈ ప్రపంచాన్ని ఏ విధంగా శాసిస్తుందో వివిధ రకాలుగా చిత్రీకరించారు. ఆ సినిమా ఆధారంగా అందులో విషయాలను ప్రస్తుత సమాజానికి, ఆర్థిక పరిస్థితులకు అన్వయించి ప్రసంగించింది. ఒక క్రమ పద్ధతిలో చెప్పవలసిన విషయాలను సూటిగా అర్థవంతంగా వివరించింది.

చివర్లో డబ్బుకన్నా, ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వం, ఆప్యాయత, అనురాగం, అభిమానం వంటివి ఎంతో విలువైనవని, వీటిలో దేనిని కూడా డబ్బుతో కొనలేమని మానిక్ చంద్రచూడ్ తన ప్రసంగాన్ని ముగించింది. ఒకవైపు డబ్బు ప్రాముఖ్యం, సంపాదించాల్సిన అవసరాన్ని వివరిస్తూ మరో పక్క డబ్బు సంపాదన వెనుక పరుగులు పెట్టి మానవత్వ విలువలు మరిచిపోకూడదని చెప్పడం ద్వారా ఇచ్చిన అంశాన్ని చక్కగా ప్రెజెంటు చేయగలిగింది. అదే ఆమెకు బహుమతిని తెచ్చిపెట్టింది.

అంతర్జాతీయ స్థాయిలో 'బెస్ట్ నాన్ నేటివ్ ఇంగ్లీషు స్పీకర్'గా అవార్డు మానిక్ చంద్రచూడ్ స్వంతమైంది. భారతదేశంలో ఇటువంటి పురస్కారం పొందిన ఏకైక బాలికగా మానిక్ ప్రత్యేక గుర్తింపును పొందింది. అలా లభించిన గుర్తింపు ఆధారంగానే ఆమె ఎన్నో సంస్థల ప్రశంసలను, అభినందనలను పొందింది.

చివర్లో డబ్బుకన్నా, ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వం, ఆప్యాయత, అనురాగం, అభిమానం వంటివి ఎంతో విలువైనవని, వీటిలో దేనిని కూడా డబ్బుతో కొనలేమని మానిక్ చంద్రచూడ్ తన ప్రసంగాన్ని ముగించింది. ఒకవైపు డబ్బు ప్రాముఖ్యం, సంపాదించాల్సిన అవసరాన్ని వివరిస్తూ మరో పక్క డబ్బు సంపాదన వెనుక పరుగులు పెట్టి మానవత్వ విలువలు మరిచిపోకూడదని చెప్పడం ద్వారా ఇచ్చిన అంశాన్ని చక్కగా ప్రెజెంటు చేయగలిగింది. అదే ఆమెకు బహుమతిని తెచ్చిపెట్టింది.

* * *

సాయంత్రం ఆరుగంటలైంది.

లండన్ ట్రినిటీ కాలేజీ ప్రాంగణం...

కాలేజీ విడిచిపెట్టినప్పటికీ విద్యార్థినీ విద్యార్థులు తిరుగుతూనే ఉన్నారు. కొంతమంది సమీపంలో చెట్లకింద సిమ్మెంటు బెంచీలపై కూర్చుని ఉండగా మరికొంతమంది లైబ్రరీహాల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

మానిక్ చంద్రచూడ్ ఒంటరిగా కూర్చుంది.

'స్పీచ్ అండ్ డ్రామా' తరపున ట్రినిటీ కాలేజీవారు నిర్వహించిన డ్రామా పరీక్షలలో పాల్గొనడానికి ఆమె అక్కడికి విచ్చేసింది. వారం రోజులపాటు జరిగే ఆ కార్యక్రమంలో అప్పటికే నాలుగురోజులు గడిచిపోయాయి.

బెస్ట్ స్పీకర్‌గా గుర్తింపు లభించిన తర్వాత ఆమెకు వచ్చిన అవకాశాన్ని ఆ విధంగా సద్వినియోగం చేసుకుంది. చాలా ప్రాంతాల నుంచి స్పీచ్ అండ్ డ్రామా విషయంలో శిక్షణ పొందడానికి ఎంతోమంది ఉత్సాహవంతులు అక్కడికి విచ్చేశారు. అందరితో కలసి ఉండటం ఒక అరుదైన అవకాశంగా చంద్రచూడ్ భావించింది. ఆ కళాశాలలో ప్రత్యేకంగా నేర్పిస్తున్న అనేక విషయాలు ఆమెకు ఎంతో ఆసక్తిని కలిగించాయి. అటువంటి శిక్షణ పొందడం ఆమెకు ఎంతో ఆనందం కలిగించింది.

లండన్ ట్రినిటీ కాలేజీలో స్పీచ్ థెరపీలో ప్రొఫెసర్ లివింగ్‌స్టన్ చంద్రచూడ్ ప్రతిభను చూసిన వెంటనే గమనించారు. ఆయనకు చంద్రచూడ్ పట్ల అభిమానం కలిగింది. ఆమె పబ్లిక్ స్పీకింగ్ విషయంలో సాధించిన విజయాలను తెలుసుకున్నారు.

"మానిక్ ఏమిటి ఒంటరిగా ఉన్నావు?"

ప్రొఫెసర్ వచ్చి పలకరించడంతో ఆలోచనల్లో ఉన్న మానిక్ ఈ లోకంలోకి వచ్చింది. ఎదురుగా ఉన్న ప్రొఫెసర్‌ను చూసి నమస్కారం చేసింది. ఆమె నుంచి ఎటువంటి జవాబు రాకపోవడంతో లివింగ్‌స్టన్ ఆశ్చర్యపోయాడు.

"హోం సిక్‌నెస్ వచ్చిందా? ఎంతలే మరో రెండు రోజుల్లో కార్యక్రమం అయిపోతుంది. ఎంచక్కా విమానం ఎక్కి మీ ఊరిలో దిగొచ్చు!" అన్నారు.

"ప్రొఫెసర్! ఈ కాలేజీలో నిర్వహించిన పరీక్షలు నాలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి. ఇటువంటి అవకాశం అందరికీ కలుగుతుందా?"

"ఏమో! నీలా అందరూ కృషి చేయాలిగా!"

"ఏ కెరీర్ ఎన్నుకున్నా పబ్లిక్ స్పీకింగ్ మంచి కమ్యూనికేషన్ సాధనంగా ఉపయోగపడుతుంది. దీనిని ఒక కోర్సుగా అభివృద్ధి చేస్తే బాగుంటుంది!"

"నీ సూచన బాగుందమ్మా! ఈ దేశంలో ఎలాగూ ఉంది. మీ దేశంలో కూడా నువ్వే అ ప్రయత్నం ఎందుకు చేయకూడదు?" తనమీద అంత నమ్మకం కలిగిన ప్రొఫెసర్‌ని చూసి ఆమెకు ఒకింత గర్వం కలిగింది. మనసు మారుమూలల్లో ఒకలాంటి ఆనందం పిల్ల తిమ్మెరలా కమ్ముకుంది.

"పుస్తకపఠనం, కవిత్వం రాయడం, స్విమ్మింగ్ వంటి హాబీలతో ఉన్న యువతరం పబ్లిక్ స్పీకింగ్ పట్ల మక్కువ కలిగేలా ఇండియా వెళ్లినప్పటి నుంచి కృషి చేస్తాను. మీ వంటి పెద్దల ఆశీర్వాదం ఎప్పుడూ నాకు ఉంటుందన్న నమ్మకం ఉంది!" అంది.

"బెస్టాఫ్‌లక్!" అంటూ లివింగ్ స్టన్ ముందుకు కదిలారు. ఆయన వెళుతున్న వైపే మానిక్ చంద్రచూడ్ చూస్తుండిపోయింది.

చెట్లు రాల్చిన ఆకులు ఆమె కాళ్లపై పడిముద్దాడాయి.

❖

రుక్మిణి

"మీరు 'మోడల్‌గర్ల్'గా బాగా రాణిస్తారు". అతను నిర్మొహమాటంగా నా కళ్ళలోకి నూటిగా చూస్తూఅన్నాడుగ.

నేను నిభాయించుకున్నాను.

"అవును. యం.ఏ. సోషియాలజీ... డిప్లొమా ఇన్ ఇంగ్లీషు లాంగ్వేజ్ కూడా చేశానుగదా!" నేను గుంభనంగానే అన్నాను. అతను దీన్ని పట్టించుకోనట్లు కిటికీలో నుండి బయటకు చూస్తున్నాడు.

"ఇంతకీ... మోడల్‌గర్ల్‌గా నా ప్లస్ పాయింట్సేంటి... నా ప్రోస్పెక్ట్స్ ఏంటి?" నా మాటల్లో కవ్వింపు ఏ మాత్రం లేకుండా జాగ్రత్తపడ్డాను. అతని మొహం ట్యూబ్‌లైటులా వెలిగిపోవడం నేను కనిపెట్టేశాను.

"చూడండి మేడం... మీరు చాలా అందంగా వుంటారు. మీది ఫోటోజెనిక్ ఫేస్. మీ ఎత్తు... మీ కలరూ... అబ్బో... మీరు ముందు మా స్టూడియోలో మీ యొక్క స్ట్రక్చరల్... ఎనటామికల్ ఏంగిల్స్ ఒక అరడజను... మీ చార్మ్ మీ నవ్వుతో కూడిన మొహాన్ని క్లోజప్‌లో...టాప్... డిస్టెన్స్ యాంగిల్స్‌లో తీసి వాటిని కంప్యూటర్లో పెడతాం... అఫ్‌కోర్స్... ఇది ఒకటి రెండు రోజులు ప్రాసెస్".

"తర్వాత?"

"ఏముందీ... మా యాడ్ ఏజన్సీ నుండి ప్రొడక్షన్ కంట్రోలర్స్‌కూ... మేనేజర్స్‌తో మాట్లాడి ఫ్రాంచైస్‌లో మీకు టర్మ్స్ వినిపిస్తాం. మీరిష్టమైతే అగ్రిమెంటు చేసుకుందురుగాని...

"టర్మ్స్... అగ్రిమెంట్సు గురించి చెప్పండి?" అనడిగా.

"యాడ్స్ రెండు రకాలు... ఒకటి ప్రింట్ మీడియా... రెండు మూవీ... టీ వీవిజువల్ మీడియా... అఫ్‌కోర్స్.... సంవత్సరం అగ్రిమెంటు ఒక రకం... టోటల్‌గా ఒక్కసారే రెమ్యునరేషన్ ఇచ్చేయడం... సో... మేడం... మీరు ఈ రంగంలో టాప్ లేపేస్తారు. అసలు మీకు టిఫిన్ చేసే తీరిక కూడా వుండదు. మీరు శిఖరాగ్రానికి చేరితే మా యాడ్ కంపెనీకి అదో అడిషనల్ అస్సెట్"!

"అదిసరె... యాడ్స్ చూస్తున్నా అంత అసహ్యంగా వుంటున్నాయేంటి?" అన్నాను. బాంబు పక్క జేబులో పేలినట్లు అతను బిత్తరపోయి చిన్నబుచ్చుకుని నాకేసి మిటుకు, మిటుకు చూస్తున్నాడు.

"అంత 'అసహ్యంగా' ఏమున్నాయి మేడం"! గుటకలు మింగుతూ అన్నాడు.

"ఈ కారుయాడ్ చూడు. ఈ కారు కంపెనీ ఎవరిది?" అడిగాను.

"అబ్బో... విన్సెంట్‌గారు...ముఖర్జీగార్లది!"

"అంటే ఆ కార్ల కంపెనీ యజమానులు మగవాళ్ళు. ఈ కార్లని ఎక్కువగా వాడేదీ పురుషులే! సరే... దీనిచుట్టూ అర్ధనగ్నంగా నలుగురు గర్ల్ మోడల్సెందుకు? ఆ ప్రొడక్షన్‌తో...యుటిలిటిలో ఏ విధమైన సంబంధమూ లేని వాళ్ళతో దీన్ని ప్రచారం చేయించడం ఎందుకూ? వాళ్ళనట్లా పెట్టకుండా ఆ కంపెనీ యజమానులో...మేనేజర్లో కట్ డ్రాయర్లేసుకుని చిందులేస్తూ ఫోజుల్తో యాడ్ ఇవ్వచ్చుగదా?"

అతను సర్దిచెప్పబోయి పూరుకున్నాడు.

"ఇదుగో... ఇది చూడు. ఇవి మగాళ్ళ బూట్లు...ఇది బూటు పాలీషు...ఇది వాళ్ళు గెడ్డం గీసుకునే రేజరు...ఈ వస్తువులన్నీ వాడేది మగవాళ్ళు కదా...వీటి యాడ్స్‌కు గర్ల్ మోడల్సెందుకు? ఎవరి వస్తువులను వాళ్ళే ప్రకటనలిచ్చుకుంటే పోలా...హవ్వ...ఈ బ్లేడ్స్ యాడ్‌లో కూడా ఆడవాళ్ళే"!... అతను తడబడుతూ లేచాడు.

"ఇదుగో ఒకమాట వినండి. నేను మోడల్‌గర్ల్‌గా ఉంటాను... కాదనడం లేదు "మోడల్"కు అర్థం మీ మార్కెట్టు చెప్పే అర్థం వేరు. నా అర్థం వేరు. "ఆదర్శవంతమైన" అని అఫ్‌కోర్స్...మోడలింగ్‌ను నేను ద్వేషించడం లేదు. అవి అర్థవంతంగా సత్యంగా వుండాలి. అవునా... మరి నేను దేన్లో మోడల్... నాకు తెలిసిన నా సామాజిక బాధ్యతలు చాలా వున్నాయి. ఒక మంచి ఉద్యోగంలో ముందు స్థిరపడాలి. నలుగురికి సాయపడాలి. మా పిల్లల్ని ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దాలి. చీకటిని తిట్టుకుంటూ కూర్చోకుండా చిరుదీపాన్ని వెలిగించే ప్రయత్నం చేయాలి. అదీ మోడల్‌గా ఉండటమంటే.

అరరె... వెళ్ళిపోతున్నారేం... అరె..."

ప్చ్! అతను ఎపుడో బయటపడ్డాడు. రోడ్డునపడ్డాడు... ఇంకో ఆడచేప తన మోడలింగ్ గాలానికి తగుల్తుందేమోననే వేటకు. ❖

అగగో...! శాసనమండలత్తంది...

కాలువ మల్లయ్య

ఏందే రాజమల్లన్న...! గీ మాట ఈనడమ ఊకూకె వినబడ్తంది... శాసనమండలి వత్తంది వత్తందనంటున్నరు... గదేందో నాకరుతమయిత లేదు... మనం ఐదేండ్లల్ల రొండుమూడు సార్లు ఏదో ఎన్నికల పేరుమీద ఓట్లేత్తనే ఉన్నంగద...! మొన్న మొన్ననే ఓట్లేసి ఉన్నోళ్లను దించి ఇంకోగలను ఎన్నుకున్నం గద...! మల్ల గిదేందట...? మల్ల ఓట్లేసుడా ఏంది...? గిదో భాగోతం... అసలు గీ శాసనమండలంటేందో చెప్పుతవా... ఇప్పుడున్న నాయకులు సాలరని ఇంకా కావల్నా ఏంది...? గిదేందో నాకు సమజయిత లేదు..." అన్నడు నర్సింగరావు.

రాజమల్లు నెత్తిగోక్కున్నడు...

"పత్రికలల్ల సదివేకద నువ్వు గీ మాటంటున్నది... గదాంట్ల గిదీన్ని గురించి పురాగ సదవలేదా మరి! ఆల్లు రాయలేదా...!"

"గవ్వన్ని ముక్కకు ముక్క సదివి యాదికుంచుకోవల్నాంటే అందరి నుంచయితదా...? నీకు తెలుత్తె గదేందో చెప్పలేదు... చెప్పుమంటె నువ్వు గూడ మీది మీదికి పోవద్దవేందే... ఎన్నికలప్పుడు మేం గెలిత్తే గదాన్ని మల్ల తెరుత్తమనుడు విన్నం.. చదివినం. గెల్చినంక ఇగ తెరుత్తం అగ తెరుత్తం అంటున్నరు... గిదెప్పుడు తెరుత్తరో నాకయితే తెలుత్తలేదు. అసలు గదేందో చెప్పమంటే చెప్పుత లేకపోతివి...

"చెప్పాల్నా...?"

"చెప్పమనే కదా అడిగింది... ఊరియ్యవడితివేంది..?"

"నిజం చెప్పల్నా..? అవద్దమా..?"

"నీ పేరే నువ్వద్ది రాజమల్లన్నాయే.. అవద్దమెట్ల జెప్పుతవు..? నిజమే చెప్పు..."

"కేంద్రంల రాజ్యసభ ఎట్లనో రాష్ట్రంల గిది గట్ల... గిదాన్నే పెద్ద సభంటరు... విధాన సభ అంటే అసెంబ్లీగద... గదుండగ మల్ల గిదెందుకంటరేమో..? గా మాట నిజవే.. కాని కొన్ని రాష్ట్రాలు కావాలనుకున్నయి... కొన్ని అవసరం లేదన్నయి... ఒక విధంగ ఆలోసిత్తే గిది ఉన్నా లేకున్నా ఒక్కటేననిపిత్తది..."

"ఇంతకు పెద్దల సభంటేంది..?"

"పెద్దలుండే సభ పెద్దల సభ.."

"భలేగ చెప్పినవే... రాజమల్లన్నా..! మరి పెద్దలంటెవ్వరు..? ముసలోల్లా..? అరువయేండ్లు దాటినోల్లన్నట్టా..?"

"పెద్దలంటే వయోవృద్ధులని అరుతమేం గాదు... ఒక విధంగా జ్ఞాన వృద్ధులని... ఒక్కొక్క రంగంల నిపుణులను, మేధావులను, రచయితలను, సామాజిక కార్యకర్తలను, తాత్వికులను ఇందులో తీసుకుంటరు... ఎమ్మెల్యేలకేసినట్టు ఓటేసుడేముండది... వీల్లందరు దాదాపు నామినేట్ చేయబడుడో, ఎమ్మెల్యేలతో ఎన్నుకోబడుడో జరుగుతది. వీళ్ళ హోదా ప్రజలతో ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలతో సమానం... ఇట్ల ఎన్నుకోబడ్డోళ్లను మంత్రి వర్గంలోకి గూడ తీసుకోవచ్చు. వివిధ రంగాల్లోంచి మేధావులు రాజకీయాలకు వచ్చుటానికిది ఉపయోగపడ్డది. వాళ్లు ఎమ్మెల్యేల వలె లక్షలు, కోట్లు ఖర్చుపెట్టి అన్నిట్నే ఎదుర్కొని గెలుసుడు కష్టం కాబట్టి గిట్ల ఎన్నికయితరు... వివిధ రంగాల్లో నిపుణులయిన వాళ్ల సేవలను వుపయోగించుకుంటానికి ఈ పద్ధతుపయోగపడుతది... మేధావులకు రాజకీయాలవసరం లేదని కాకుండా వాళ్లూ ఉపయోగపడాలని గీ పద్ధతి పెట్టిండ్రు... శాసనసభలో మెజారిటీని బట్టో విషయాన్ని బట్టో చట్టం చేయడానికి చర్చ జరిగిందనుకుందాం... అటెనుక దాన్ని పెద్ద సభల గూడ పెడ్తరు... అక్కడ గూడ చర్చిస్తరు... ఇండ్ల ఉండేది వివిధ రంగాల నిపుణులు, మేధావులు కద! అందులోని విషయాలను రాజకీయాలకతీతంగా చర్చిస్తరు... సలహాలిస్తరు... గిసొంటి సదుద్దేశం తోనే గిది ఏర్పాటయ్యింది... కాని..."

"నదుమ గా కానీ ఏంది..?"

"పెద్దల సభ ఉద్దేశ్యమేందో, అండ్ల ఎవ్వలను చేర్చుకోవాల్నో అన్న విషయాన్ని పక్కకు పెట్టి కేవలం రాజకీయాలకే, తమ పార్టీ వాళ్లకే స్థానం కల్పించుడు అన్ని పార్టీలల్ల జరుగుతుంది... కొంత మంది మేధావులకు స్థానం లేకపోలేదు... కాని అస్మదీయులకు దొడ్డి దారిన స్థానం కల్పించటానికే ఇదుపయోగపడ్డంది..."



"మరి గిదెందుకు రద్దయినట్టు...?"

"ఎన్టీఆర్ పార్టీ పెట్టిన తొమ్మిది పది నెలల్లనే అధికారంల కొచ్చిండు గద..! అయినె పార్టీ కొత్తదాయే... అంతకు ముందు నుండి పెద్దల సభల ఉన్నోళ్లంత ఎక్స్‌పార్టీ వాళ్లాయె... శాసనసభల ...., శాసన మండలిల కాంగ్రెస్‌కు మెజారిటీ ఉండె... ఈ కారణాలతో పాటు ఇంకా అనేక రాజకీయ కారణాలు. దాంతో లాభం లేదనుకొనుడుతోని దాన్ని రద్దు జేసిండు. ఒక్క కలం పోటుతోని ఎంతో మందిని రాజకీయ నిరాశ్రయులను జేసిండు.."

"నిజానికి చూస్తె దీని మీదయ్యే ఖర్చు దండుగేనేమో..?"

"మన రాజకీయులు పెడ్తున్న ఖర్చులు, ఇతర వ్యయాలను చూస్తె గిదేమంత లెక్కించదగ్గది కాదు.. అండ్లకు రావాల్సిన వాళ్లచ్చి సభ ఉద్దేశ్యం నెరవేరితే గిది మంచిదే.."

"అంటేందే రాజమల్లన్న... ఏందో మరుగున పెట్టి చెప్పవడ్తివి.."

"నేనేం మరుగున పెడ్తన్న... నాకు తెల్సింది ఖుల్లం ఖుల్లంగ చెప్పుడే అలువాటాయే... నేననేదేందంటే గా పెద్దల సభెందుకో అరుతం చేసుకుని అందుకు తగ్గోల్లను అండ్లకు తీసుకోవాలె... వివిధ రంగాలల్ల నిపుణులైన మేధావులు, విద్యావేత్తలను ఇండ్లకు తీసుకుంటె ఆయా విషయాల్లో సరైన సలహాలు, సూచనలు లభించే అవకాశముంది... రాజకీయాలు అసలే వద్దని కాదుగని అస్మదీయుల పేరుతో పెద్దలసభ నిండ రాజకీయాల్నే నింపుతె కలిగె లాభం శూన్యం..."

"గా మాట నిజమేనే రాజమల్లన్న...కాని గిది ఉండాల్నని కొందరు మొత్తుకుంటున్నరు.. గిది ఉంటె మంచిదా..? లేకుంటె మంచిదా..?"

"గిట్ల అనుట్ల గూడ రాజకీయాలున్నయన్న సంగతి మర్చిపోవద్దు... మనోల్లు వచ్చేటట్లుంటె ఉండాల్నంటరు... కాకుంటె వద్దంటరు... రాజకీయాలిప్పుడు రెండు దిక్కుల పదునున్న కత్తోలె మారినయి... దీన్ని మంచికోసం ఉపయోగించచ్చు... చెడ్డకోసం ఉపయోగించచ్చు... చాలా వరకు రాజకీయాలు రెండు తల్కాయల పాములసొంటోల్లు.."

గీ సభకు నిజంగనే వివిధ రంగాలల్ల నిపుణులైన పెద్దలను, మేధావులను తీసుకుంటె మంచిదే.. శాసనసభల చర్చలెట్లయితున్నయో చూత్తున్నం గద... అసలు సంగతిడిసి పెట్టి అన్ని రాజకీయాలే..! అధికారంల ఉన్నప్పుడు ప్రైవేటైజేషన్‌ను సమర్థించినోల్లు ప్రతిపక్షంలకొత్తె వ్యతిరేకిస్తరు... గిట్ల అన్ని విషయాలను రాజకీయం జేత్తరు...

పెద్దల సభకు గిట్లగాకుండ మంచివాళ్లను తీసుకుంటే సరైన విషయాల మీద సరైన పద్ధతిల చర్చలు జరుగుతయి... దాంతో ప్రయోజనముంటది... ఇదు వరకటి అనుభవాలను బట్టి గీ సభలకు సరైన వాళ్లను తీసుకునెటట్లుంటె ఇది ఉండుడు మంచిదే.. లేకుంటె మాత్రం అదనపు భారమైనట్టే..." అన్నడు రాజమల్లన్న..

పొగ తాగని వాడు ధన్యుడు సుమా!

మే 31
ప్రపంచ
ధూమపాన
వ్యతిరేక
దినం

డా॥ నాగినేని భాస్కరరావు

యంగ్ విడో బుచ్చమ్మను ఆకర్షించటానికి గిరీశం ఆమె తమ్ముడు వెంకటేశంకు లెక్చరిస్తూ "పొగతాగనివాడు దున్నపోతై పుట్టున్" అని గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం' నాటకంలో చెప్తాడు. కన్యాశుల్కాలు పోయి 'వరకట్నాలు' (ఇవీ అవాంఛనీయమే) వచ్చాయి. వరకట్న నిషేధ చట్టమూ వచ్చింది. కాని ధూమపానం యింకా నాగరిక సమాజం నుండి పోలేదు. పొగతాగటం వల్ల కల్గే దుష్ఫలితాలను గమనించిన భారత ప్రభుత్వం, ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, బస్సుల్లో, ఆఫీసుల్లో, ఆస్పత్రుల్లో, హోటల్స్‌లో, కాలేజీలలో, రైళ్లలో సైతం 'పొగతాగుట'ను నిషేధించింది. అయినా ధూమపానం ఇంకా ప్రజల మధ్యన తన ఉనికిని చాటుతూనే వుంది. ధూమపానంవల్ల కలిగే దుష్పరిణామాలను తెలుసుకొని, దానిని మానివేసే చిట్కాలు తెలుసుకుందాం.

ధూమపానం ఎందుకు చేస్తారు?

పొగాకుతో తయారయ్యే చుట్టలు, బీడీలు, సిగరెట్లు కాల్చేవారికి పొగాకులో వుండే ముఖ్య పదార్థం 'నికోటిన్' కల్గించే మానసిక ఆహ్లాదమే కారణం. ఈ పదార్థమే ధూమపానాన్ని ఒక వ్యసనంగా మారుస్తుంది. అందువల్ల ధూమపానం చేసేవారు తమ రక్తంలో 'నికోటిన్' పదార్థ స్థాయిని తగ్గకుండా వుంచేందుకు తరచు సిగరెట్లు లేక చుట్టలు లేక బీడీలు కాలుస్తారు. తమకు ఆనందం కలిగేట్లుగానూ, దానిని విడిస్తే/మానేస్తే కలిగే ఇబ్బందుల్ని తప్పించుకోవటానికి దాన్నొక దురలవాటుగా మార్చుకుంటారు. ఒక గుక్కకోసం 'ఎంగిలి'ని లెక్క చేయరు.

పొగాకులో వుండే హానికర పదార్థాలు: కాల్చని పొగాకులో చిగుళ్లవ్యాధులను, నోటి క్యాన్సరును కల్గించగల నికోటిన్, కాన్సరు కల్గించే కారకాలు ఇతర హానికరమైన పదార్థాలుంటాయి. పొగాకును కాల్చినపుడు వచ్చే పొగలో నికోటిన్‌తోపాటు కార్బన్‌మోనాక్సైడ్ 4000 రకాల యితర పదార్థాలు వుంటాయి. అంతేకాక పొగాకు ఉత్పత్తులను తయారు చేసేటప్పుడు అనేక యితర రసాయనాలు కలపబడతాయి. ధూమపానం చేసినపుడు పొగ ఊపిరితిత్తుల్లోకి వెళ్లే వాయు మార్గాల్లోనూ, ఊపిరితిత్తుల భాగాలైన అల్‌వెడార్ సర్ఫేసెస్‌ను ఆవరిస్తుంది. ఈ పొగలో కాన్సరును కల్గించగల 40 రకాల విష కారకాలుంటాయి.



నికోటిన్‌ను, తేమను వేరు చేశాక మిగిలిన పొగాకు పదార్థమును తారు అంటారు. పొగాకు పొగలో ఒక (avapour) ఆవిరిదశ వుంటుంది. ఈ ఆవిరి దశలోని పొగలో కార్బన్‌మోనాక్సైడు, శ్వాస కోశమును ఇబ్బంది కల్గించే పదార్థములు ఇంకా అనేక ఆవిరయ్యే మిశ్రమాలు వుండి సిగరెట్టు తాగినపుడు వచ్చే 'ప్రత్యేక వాసన'కు కారణమౌతున్నాయి.

పైపుల్లో, సిగార్స్‌లో ఉపయోగించే పొగాకు నుండి వచ్చే పొగ నోటిలోనే 'నికోటిన్'ను పీల్చుకునేట్లు చేసి పొగత్రాగేవారి యొక్క 'నికోటిన్' అవసరాన్ని తీరుస్తుంది. కనుక పైపుల ద్వారా, సిగార్స్ ద్వారా పొగాకును తాగే వారు పొగను ఊపిరితిత్తుల్లోకి పీల్చరు. వీరిలో నోటి క్యాన్సరు ఎక్కువగా వచ్చే అవకాశం వుంది. కాని సిగరెట్లలో ఉపయోగించే పొగాకు పొగ నోటిలో నికోటిన్‌ను తీసుకునే శక్తిని తక్కువచేస్తుంది. కనుక సిగరెట్లు తాగే వారు పొగను ఊపిరితిత్తుల్లోకి పీల్చుకొని తమకు కావాల్సిన 'నికోటిన్' ను పొందుతారు. వీరిలో పొగ ఊపిరితిత్తుల్లోకి పోవటంవల్ల వీరు దీర్ఘకాలం పొగతాగితే గుండెజబ్బులు, ఊపిరితిత్తుల కాన్సరు, ఇంకా ఇతర జబ్బులు వస్తాయి.

కొందరు కాలుతున్న చివరను నోటిలో పెట్టుకుని పీలుస్తుంటారు. వీరిలో నోటికాన్సరు, గొంతు కాన్సరు వచ్చే అవకాశం ఉంది.

జబ్బులు-దుష్ఫలితాలు

సిగరెట్లు, బీడీలు, చుట్టలు కాల్చే వారిలో 40శాతం మంది వారి జీవనప్రమాణం తగ్గి ముందుగానే మరణిస్తున్నారు. పొగత్రాగటంవల్ల ఈ క్రింది జబ్బులు వస్తాయి.

1) గుండె, రక్త నాళములకు సంబంధించిన వ్యాధులు:

సిగరెట్లు కాల్చేవారిలో వాటిని కాల్చని వారికంటే ఎక్కువగా పెద్ద, చిన్న రక్తనాళం వ్యాధి, రక్త నాళాలు మూసుకుపోవటం, అథిరోస్క్లెరోసిస్ వచ్చే అవకాశం వుంది. సిగరెట్లు కాల్చటం వల్ల మధుమేహంలేని జనాభాలో 90 శాతం రక్త నాళముల వ్యాధులు కలుగుతున్నాయి. అంతేకాక 20-30 శాతం కరోనరీ ఆర్టరీ (గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళం) వ్యాధికి, 10 శాతం మెదడు రక్త నాళములు మూసుకుపోయే వ్యాధికి పొగ తాగటం కారణమౌతున్నది.

సిగరెట్లు కాల్చటంవల్ల రక్తంలోని ప్లేట్లెట్లు అను కణాలు గుమికూడటాన్ని, రక్తనాళాలు మూసుకుపోవటాన్ని ప్రోత్సహించటంవల్ల గుండెపోటు, హఠాత్తుగా గుండె ఆగిపోయి మరణం సంభవిస్తాయి. అందువల్ల సిగరెట్లు త్రాగేవారిలో మొదటిసారి గుండెపోటు వచ్చి బ్రతికిన వారు సిగరెట్లను మానివేయటం వల్ల వారికి మేలు కల్గుతుంది. గుండె లేక రక్త నాళముల జబ్బులకు బైపాసు ఆపరేషన్లు చేయించుకున్నవారు, ఆంజియో ప్లాస్టీ చేయించు కున్నవారు సిగరెట్లు తాగటం మానివేయక పోతే మరల ఆ రక్త నాళాలు మూసుకుపోయి తిరిగి జబ్బు పడతారు. కావున పొగ తాగటం వారు మానాలి. అధిక రక్తపోటు, రక్తంలో అధిక క్రొవ్వు ఉన్న వారు పొగతాగితే గుండె జబ్బులు త్వరగా రావటం లేదా అప్పటికే అవి వున్నట్లయితే వాటిని తీవ్రతరం చేయటం జరుగుతుంది. అందువల్ల వారు సిగరెట్లు త్రాగటం మానివేస్తే గుండెజబ్బులు, రక్త నాళాల జబ్బుల బారి నుంచి తప్పించుకొనవచ్చును.

క్యాన్సరు:- పొగతాగటంవల్ల పెదాలు, నోరు, గొంతు, అన్న వాహిక, క్లోమం, స్వర పేటిక, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, మూత్రకోశం, మూత్రపిండాలకు సంబంధించిన ఇతర అవయవాలు క్యాన్సరు బారిన పడే ప్రమాదం ఎక్కువగా వున్నది. సర్వైకల్ జీర్ణకోశ క్యాన్సరు వచ్చే అవకాశం వుంది. క్యాన్సరు ప్రమాదం తాగే సిగరెట్ల సంఖ్య, పొగతాగుతున్న కాలం మొదలైన వాటిపై ఆధారపడి వుంటుంది. ధూమపానానికి తోడు సారాయి తాగుడు వ్యసనం వున్నట్లయితే మరింత త్వరగా ఆ ధూమపాన, సురాపానప్రియులు నోరు, అన్నవాహిక, ఊపిరితిత్తుల క్యాన్సరుకు గురవుతారు.

కొన్ని వృత్తుల్లో పనిచేస్తున్నవారు ధూమపానంచేస్తే ఊపిరితిత్తుల కాన్సరుకు త్వరగా గురవుతారు. ఉదాహరణకు అస్బెస్టాసు పరిశ్రమ.



ధూమపానాన్ని మానివేస్తే ఊపిరితిత్తులకు వచ్చే క్యాన్సరును నివారించుకోవచ్చును.

శ్వాసకోశవ్యాధులు: క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మోనరీ డిసీజ్ అను వ్యాధి రావటానికి 90 శాతం కారణం పొగతాగటం. ఎక్కువకాలం సిగరెట్లు కాల్చటంవల్ల, పొగవల్ల ఆ వ్యక్తి ఊపిరితిత్తులలోని వాయుమార్గాలు తమ సాధారణ నిర్మాణాన్ని కోల్పోయి క్షీణించి ఓ.పి.డి అంటే వాయు మార్గాల్లో ఆటంకం ఏర్పడటం, పల్మనరీ వంటి జబ్బులకు దారితీస్తాయి. కళ్లెతో కూడిన దగ్గుతో బాధ పడతారు. ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గుతుంది. కనుకే పొగతాగటం మానాలి.

గర్భం దాల్చటం: స్త్రీలు ధూమపాన వ్యసనపరులైతే వారు గర్భం దాలిస్తే అనేక అవాంఛనీయ పరిస్థితులు కల్గుతాయి. ఉదాహరణకు పిండం పొరలు ముందుగానే చిట్లిపోవటం, గర్భస్రావం కావటం, నెలలు నిండక ముందే ప్రసవించటం, ప్రసవించిన శిశువు కూడా సడెన్ ఇన్‌ఫాంట్ డెత్ సిండ్రోమ్‌తో మరణించటం, ఒకవేళ శిశువు బ్రతికినా మొదటి ఐదు సంవత్సరాల్లో పెరుగుదల తక్కువగా ఉండటం. అందువల్ల స్త్రీలు పొగత్రాగరాదు.

ఇంకా ధూమపానం వల్ల కడుపులో పుండ్లు ఆలస్యంగా మానుతాయి. ఎముకల్లో ఆస్టియోపోరోసిస్ వ్యాధి వస్తుంది. వయస్సుపైబడి వచ్చే కంటి శుక్లాలు త్వరగా వస్తాయి. స్త్రీలలో ముందుగానే 'ముట్లు' ఉడిగిపోతాయి. చర్మం త్వరగా ముడుతలు పడుతుంది.

స్పర్శ కోల్పోయిన చేతులు గల కుష్ఠురోగుల్లో పొగతాగటంవల్ల చేతులు కాలి పుండ్లు పుడతాయి.

ధూమపానం చేసేవారు వాతావరణంలోకి విడిచే కలుషితమైన గాలిని పీల్చటంవల్ల పొగ తాగని వారు కూడా ఊపిరితిత్తుల క్యాన్సరు, గుండెజబ్బులకు గురవుతారు. అంతే కాక ఇతర ఊపిరితిత్తుల జబ్బులు, దీర్ఘకాలిక చెవిపోటు, పిల్లల్లో అస్తమా, పిల్లల్లో అస్తమా అకస్మాత్తుగా ఎక్కువకావటం మొదలైనవి వస్తాయి.

పొగతాగటం వల్ల ఆ వ్యక్తులు మందులు వాడాల్సి వచ్చినపుడు వీటిపై ఎంతో ప్రభావం పడుతుంది.

ధూమపానాన్ని మానివేయటం ఎలా?

ధూమపానాన్ని మానివేయటం ఒక చక్రం వంటిది. పొగతాగేవారు దీనిని మానివేయాలని అనేకసార్లు ప్రయత్నించి విఫలమై చివరకు విజయం సాధించవచ్చు. సుమారు 70-80 శాతం మంది పొగతాగేవారు దానిని మానివేయాలని భావిస్తారు. నేటి ధూమపాన ప్రియుల్లో సుమారు 30 శాతం మంది ప్రతి సంవత్సరం పొగతాగటాన్ని మానివేయాలని ప్రయత్నించి విఫలమౌతున్నారు. సహకారం లేక 90 శాతం మంది విఫలమౌతున్నారు. కనుక పొగతాగేవారిని మూడు తరగతులుగా విభజించవచ్చును. 1. అసలు మానివేయాలన్న ఆలోచన లేనివారు. 2. పొగతాగటాన్ని మానివేయాలనుకునేవారు. 3. పొగతాగటాన్ని మానివేస్తున్న దశలో వున్నవారు. కనుక పొగ తాగటం మానివేయాలనుకున్నవారు ఈ చక్రంలోని దశలు దాటి చివరకు విజయం సాధించాలి.

వైద్యుడి సహకారంతో పొగతాగటాన్ని మానివేసే పద్ధతి లక్ష్యం:- పొగతాగే వారిని ఒక దశ నుంచి మరో దశకు తెచ్చి చివరకు మానివేసే దశకు తీసుకురావటం. దీనికి వైద్యుడి సహకారం వుంటుంది. పొగ తాగటాన్ని తక్షణమే మానివేసే పద్ధతికన్నా ఈ దశల వారీ పద్ధతి మెరుగైనది.

వైద్యుని సహకారం:- పొగ తాగుటను మాన్పించటంలో వైద్యుడు తన రోగులకు, పొగతాగేవారికి కౌన్సిలింగు ద్వారా సహకరించి వారు పొగతాగకుండా చేయ వచ్చును. ప్రతిసారీ 20-30 నిముషాల కౌన్సిలింగు ఎనిమిది వారాలపాటు జరపాలి. అవసరమైతే మానసిక అనారోగ్యంతో వున్నవారికి తగిన మందులు కూడా నేడు లభ్యమౌతున్నాయి. టెలిఫోన్ కౌన్సిలింగ్ కూడా జరుపవచ్చును.



నివారణ:- చాలామంది చిన్నతనంలో తండ్రి, తాత లేక ఇతర పెద్దల వల్ల ప్రభావితమై పొగతాగుటకు అలవాటు పడతారు. యుక్త వయస్సులో స్నేహితుల వల్ల గాని, హీరోయిజంగా భావించి గాని, సరదాకుగాని దీనికి అలవాటు పడతారు. కనుక ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే పొగతాగడాన్ని నివారించాలి. ❖

దంత సంరక్షణ

క్విజ్-9

నిర్వహణ:
డా॥ కె.ఎల్.వి. ప్రసాద్,
హన్మకొండ

1. పళ్ళను గట్టిగా తోమితే! (బ్రష్ చేస్తే...)
   - అ. తెల్లగా వస్తాయి
   - ఆ. తెల్లగా మెరుస్తాయి
   - ఇ. పళ్ళు అరిగిపోతాయి
   - ఈ. జివ్వుమని గుంజుతాయి
2. నిలువుగా అరిగిపోయిన పళ్ళను
   - అ. అట్రిషన్ అంటారు
   - ఆ. అబ్రేషన్ అంటారు
   - ఇ. ఇరోజన్ అంటారు
   - ఈ. అన్నీ తప్పే
3. సమాంతరంగా అరిగిన పళ్ళను
   - అ. ఇరోజన్ అంటారు
   - ఆ. అబ్రేషన్ అంటారు
   - ఇ. అట్రిషన్ అంటారు
   - ఈ. అన్నీ కరెక్టే
4. పంటి భాగం కరిగిపోవడాన్ని
   - అ. అబ్రేషన్ అంటారు
   - ఆ. అట్రిషన్ అంటారు
   - ఇ. డిసాల్వింగ్ అంటారు
   - ఈ. ఇరోజన్ అంటారు
5. 'నోటి దుర్వాసన' ను సాంకేతికంగా యిలా పిలుస్తారు
   - అ. బేడ్ బ్రీత్
   - ఆ. ఫౌల్ స్మెల్
   - ఇ. బేడ్ అడర్
   - ఈ. హెలిటోసిస్
6. నోటి అపరిశుభ్రత వల్ల, పంటిపై ఏర్పడే జిగురుపదార్థాన్ని
   - అ. పంటి జిగురు అంటారు
   - ఆ. పాచి అంటారు
   - ఇ. గార అంటారు
   - ఈ. అన్నీ తప్పే.
7. పంటిపై పేరుకునే గట్టిపడని పాచిని ఈ విధంగా పిలుస్తారు
   - అ. టార్టార్
   - ఆ. కాలిక్యులస్
   - ఇ. ప్లాక్
   - ఈ. అన్నీ కరక్టే
8. పంటిమీద గట్టిపడిన 'పాచి'ని ఈ విధంగా పిలుస్తారు
   - అ. ప్లాక్
   - ఆ. టార్టార్
   - ఇ. కాలిక్యులస్
   - ఈ. సిమ్మెంట్
9. సాధారణ వాడకంలో గట్టిపడ్డ పాచిని ఈ విధంగా పిలుస్తారు
   - అ. గట్టిపాచి
   - ఆ. పాచిబెరడు
   - ఇ. గార
   - ఈ. పాచి మట్టి
10. గట్టిపడ్డ పాచిని శస్త్రచికిత్స ద్వారా తొలగించడాన్ని
    - అ. క్లీనింగ్ అంటారు
    - ఆ. వాషింగ్ అంటారు
    - ఇ. స్క్రేపింగ్ అంటారు
    - ఈ. స్కేలింగ్ అంటారు

జవాబులు:
1. [illegible] 2. అ 3. అ 4. ఈ 5. ఈ
6. [illegible] 7. ఇ 8. ఇ 9. ఇ 10. ఈ

శాంతి కోసం అన్వేషణ

నేటి సమాజంలో మైనారిటీ వాదం ముందుకు రావడం ఒక అనివార్య సందర్భమైంది. ముస్లింల అస్తిత్వ వేదన పలుకోణాల్లో వ్యక్తమవడం ముఖ్యంగా అభద్రతాభావంతో మరింత పదునెక్కడం వంటి విషయాల్లో గాఢతపెరిగింది. ఒక ప్రక్క విదేశీ సామ్రాజ్యవాదుల విషకౌగిళ్ళలో నలుగుతూనే, తనకు తానుగా వలయాన్ని ఏర్పరుచుకుని, విభజన రేఖల్ని గీసుకుంటున్న నేటి సమాజ స్థితిగతుల్ని కవులు, రచయితలు కోడ్ చేస్తున్నారు. అలాంటి వారిలో ముందువరసలో అనదగిన కవి 'కరీముల్లా'.

సాయిబు
షేక్ కరీముల్లా
వెల: రూ.25/-
పేజీలు:100
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన భవన్, హైదరాబాద్

కరీముల్లా కొత్తవాడేం కాదు. తెలుగు సాహితీ క్షేత్రంలో "ఆముదాలు మొలిపించుడు. సముద్రగాయాల్ని తడిమి 'నా రక్తం కారుచౌక' అంటూ నినదించిన బలమైన గొంతుక ఆయనిది. ఆ క్రమంలోనే "సాయిబు" దీర్ఘకవితను వెలువరించాడు. గతంకన్నా కరీముల్లాలో కన్పించేది ఓ నూతన విషయాన్ని, ఇప్పటివరకు నెగెటివ్ అర్థంలో ఉన్న ఇస్లాం వాదాన్ని తెరమీద కెక్కించడం. ఒక పక్క ముస్లింవాదం ఉండగా ఈ 'ఇస్లాం వాద' అవసరాన్ని బలంగా విన్పించిదీ కవితలో. ***అమాయక ఎదలు/ శోక గంటల్ని మోగించాయి/ ఇట్లాంటి సమయంలో తన ముద్ర తన కలం అవసరం*** అంటూనే, ***హంతక ఐఎస్ఐ ముఠా/ ఉన్మాదక్రీడ షరా మామూలయ్యింది/ అందుకే నా ఈ కవిత్వం నా ఈ హెచ్చరిక*** అంటూ ముందు కొస్తున్నాడు కవి కరీముల్లా. ప్రతిసారీ సమస్యల్ని ఏకరువు పెట్టడంతోని ఆగిపోతుందనే ముస్లింవాద కవిత్వ అపవాదుని కరీముల్లా విశాల వేదిక, ప్రగతిశీల శక్తుల సహజీవన అవసరాన్ని గుర్తెరగడం వంటి విషయాల్లో తొలిగించబూనినట్లు 'సాయిబు'లో కన్పిస్తుంది. సమాజంలో ఏ వ్యక్తీ తప్పించుకోలేనంతగా ముంచుకొస్తున్న గ్లోబలైజేషన్‌పై కరీముల్లా కవిత్వం గాఢత నింపుకుంది. **గ్లోబల్ బనల్లో/మన ఫుట్‌పాత్ బతుకులు/ అస్థికలై కొట్టుకు పోయాయి** అని చెప్పడం వెనుక తన, తనవారి జీవితసారం కన్పిస్తుంది. ఈ 'సాయిబు' అంతిమ తీర్పు 'శాంతి' కాముకుల్ని ఆహ్వానించడం ఆహ్వానించదగింది. మతం పేరుతో (ఇస్లాంవాదం) నయవంచన చేస్తున్న కుహనావాదుల్ని. "నయ వంచక పాక్ పాలకుల్లారా/ అల్లాహ్ మిమ్మల్ని క్షమించడు అని హెచ్చరిస్తున్నాడు. అంతేకాదు 'ప్రతిసారీ హతుడ్ని నేనే" అనడంలో గత చరిత్రని, సంఘటనల సారాన్ని అక్షరబద్ధం చేయడమేకాకుండా. మా తల్లుల గర్భాలు/ టెర్రరిస్టు క్యాంపులా! అని స్పష్టంగా ఇక ఊరుకోం... అన్నంత ధిక్కారమూ కన్పిస్తుంది. 'ఇస్లాం'పై అమెరికా చేసిన వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టడంలో వేసిన కరీముల్లా ఈ తొలి అడుగు వేల, లక్షల, కోట్ల అడుగులకు పునాదిరాయి కావచ్చుననడంలో పాఠకుడు సందేహించడు. వామపక్ష భావాలే కాకుండా తన సమస్యలపట్ల సరైన దృక్పథాన్ని పాఠకుడికి స్పష్టంగా అందించిన కవి కరీముల్లాని అభినందిస్తూ, నెగెటివ్ టచ్‌లో ప్రచారంగా ఉన్న 'ఇస్లాం' వాదాన్ని సరైన క్రమంలో పాఠకులకు అందించాల్సిన బాధ్యతను గుర్తు చేస్తున్నాను.

కవి కరీముల్లా ఈ 'సాయిబు' దీర్ఘకవితతో శత్రుశిబిరం నుండే కాకుండా మిత్రబృందం (స్వపక్షం) నుండి కూడా సంధించే వాగ్బాణాలకు నిలబడుతూ సాధ్యమైనంత త్వరగా సాహితీ క్షేత్రంలో మరికొన్ని అక్షర విత్తుల్ని చల్లుతాడనీ, ఆవశ్యకతను గుర్తు చేస్తున్నాను.

- సైదులు ఐనాల

స్వీకారం



క్రిటికాలమ్
చింతపట్ల సుదర్శన్
వెల: రూ.45/- పేజీలు: 114
ప్రతులకు: చింతపట్ల సుదర్శన్
ఇం.నెం.1-5-168,
న్యూ మారుతీ నగర్, పోస్ట్: సరూర్‌నగర్,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్



జేజమ్మ కథలు
సత్తిరాజు రాజ్యలక్ష్మి
వెల: రూ.40/- పేజీలు:78
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్

కొడుక్కి తండ్రి లేఖ
రచన: ఎస్.కె. నారాయణ
వెల: రూ.20/-
పేజీలు: 60
ప్రతులకు:నవోదయ, సహచర, దిశ, మైత్రి బుక్‌హౌస్‌లలో లభించును.

ఉద్యమాల నిప్పులవాగు

ఉద్యమాల నేపథ్యంలో దీర్ఘకవితగా వెలువడిన నిప్పులవాగు పుస్తకం యుద్ధం, పోరాటం ఎలా జరుగుతాయన్న అంశం అంతర్లీనంగా వివరిస్తూ ముందుకు సాగుతుంది. కవి 'అల' ఎప్పుడెప్పుడు మన రాష్ట్రంలో యుద్ధాలు వచ్చాయో వివరించారు.

"గింజలు పండించిన ఇంట్లో గంజికి గిలగిల్లాడ్డం", "ఆరుగాలం పడిన అలసట వడ్డీకింద జమకావడం" కంట్లో దుమ్ము కొట్టి కల్లాన్ని కొల్లగొట్టడం జరిగినప్పుడు తిరుగుబాటు దానంతట అదే వస్తుందని చెప్పడం బాగుంది. ఉద్యమాలు ఎక్కడెక్కడ ఎలా పుట్టాయో కూడా కవి అన్యాపదేశంగా ప్రస్తావిస్తాడు. 'రాకాసి మూకలు భూమి హక్కును బుక్కినప్పుడు నెత్తుటి చారికలతో ఆవిర్భవించాయ"ని చెబుతాడు. పల్నాటి సీమలో చనిపోయిన కన్నెగంటి, రంపచోడవరంలో అల్లూరి విప్లవాగ్ని, చీరాలలో రామదండు, పెద నందిపాడులో శాంతిసేన, మునగాలలో పోరాటం, చల్లపల్లి జమీందారుపై తిరుగుబాటు, మందసలో వీరగున్నమ్మ పోరాటం, అలమండ రైతాంగపోరు, రైతాంగ పోరాటంలో అసువులు బాసిన కొమరయ్య పోరాటపటిమ ఇలా అన్నింటిని స్పృశిస్తూ ఈ దీర్ఘ కవిత సాగుతుంది.

ఇవన్నీ చెబుతూ పోరాటానికి ఆయన కొత్త నిర్వచనం ఇస్తారు. 'అన్యాయం కుత్తుకల్ని ఉత్తరించిన కత్తివి, దౌర్జన్యం గుండెల్లో దిగేసిన గునపానివి... ఉగ్ర చేతనానివి. ఉగ్ర బీభత్స రూపానివి... కాంతి శిఖరాల నుంచి దూకిన కోటి జలపాతాల కంఠస్వరానివి అంటూఎలుగెత్తి చెబుతారు. కవిత్వంలో ముఖ్యంగా దీర్ఘకవితా రచన ఏదో అంశాన్ని తీసుకుని దానిపై కవిత్వం రాయడం సాధారణంగా జరుగుతోంది.



నిప్పుల వాగు
(దీర్ఘకవిత)
కవి: అల
వెల: రూ. 20
ప్రతులకు:అల,
హెడ్మాస్టర్
శ్రీ లక్ష్మీనర్సింహాస్కూలు
అన్నం రాజుపేట,
విజయనగరంజిల్లా

అయితే ఉద్యమం పోరాటం యుద్ధంఅనే విషయాలు వినడానికి అనువుగా ఉంటాయి. వాటిని కవితా వస్తువుగా తీసుకుని కవిత రాయడంలో కవి అల కృతకృత్యు డయ్యాడని చెప్పవచ్చు.

-పొత్తూరి వర్మ

రాజస్థాన్ అనగానే ఇసుకవర్రల అందాల థార్ ఎడారులే కదా...ఇంకేముంది అనుకునేవారు ఆశ్చర్యపోయేంతగా అందమైన టూరిస్ట్ ప్రాంతాలనేకం ఉన్నాయి. అవి కేవలం అందమైనవే కాదు, చారిత్రాత్మక మైనవి కూడా కావడం విశేషం. అటువంటి పర్యాటక ప్రాంతాలలో "భరత్‌పూర్- డీగా-ధోల్‌పూర్" ఒక టూర్ ప్యాకేజీగా పర్యాటకులను అలరిస్తుంది.

ఈ ప్రాంతం మొఘల్ మహారాజుల చరిత్ర, మొఘలాయి సంస్కృతీ సౌరభాలతో నిండిన ప్రాంతం. రాజస్థాన్‌లో ఉన్నప్పటికీ ఉత్తరప్రదేశ్‌కు దగ్గరలో ఉండటం వల్ల ఆ రాష్ట్ర ప్రభావం ఉంటుంది. పాలకవర్గాలుగా ఝాట్‌ల ఆధిపత్యముండేది. 17వ శతాబ్దపు పాలకులు చురామాన్, బాదన్‌సింగ్‌లు ఝాట్‌లే. బాదన్‌సింగ్ కుమారుడు సూరజ్‌మల్ ఈ ప్రాంత ప్రఖ్యాత పాలకుడు. సూరజ్‌మల్ క్రీ.శ. 1732లో నిర్మించినదే "భరత్‌పూర్ కోట".

భరత్‌పూర్ కోట

ఢిల్లీకి సమీపంలో ఉండే భరత్‌పూర్ చిన్న పట్టణమైనప్పటికీ చాలా రద్దీగల పట్టణం. ఇక్కడున్న 'కియోలాడియో నేషనల్ పార్క్' చూడ్డానికైనా సరే ఈ భరత్‌పూర్‌కి ప్రయాణం కట్టాల్సిందే. ఇక్కడున్న భరత్‌పూర్ కోటను 'లోహకోట' అనీ, 'ఐరన్ ప్యాలెస్' అనీ అంటారు. అంత ధృఢమైనదని దానికా పేరు. చాలా మందపాటి మట్టి గోడలతో నిర్మితమైన ఈ కోట చుట్టూ లోతైన కందకం ఉండటం దీని ప్రత్యేకత. ఎటువంటి ఢాంబికప్రదర్శన లేనటువంటి ఈ కోట చాలా సాదాసీదాగా ఉంటుంది. కానీ రాజభవనాలు పాటించే అన్ని రకాల జాగ్రత్తలకు, సామర్థ్యాలకూ లోటులేని విధంగా ఉంటుంది.

డీగ్

భరత్‌పూర్‌కి 34 కి.మీ. దూరంలో సుందరమైన తోటలమయమైన డీగ్ ఉంది. ఇక్కడున్న రాజప్రసాదం పర్యాటకులకు కనువిందు చేస్తుంది. ఇక్కడ మొఘలాయి సాంప్రదాయలకు అద్దంపట్టే చారిత్రాత్మకమైన ప్రాంతాలనేకం ఉన్నాయి. గోపాల్‌భవన్, నంద్ భవన్,



కృష్ణ భవన్, కేశవ్ భవన్‌లు ఇక్కడ చూడదగ్గ ప్రాంతాలు.

ధోల్‌పూర్

క్రీ.శ. 1805లో వెలసిన పట్టణం ఇది. ఎన్నెన్నో భవనాలకు శోభనిచ్చే ఎర్రరాతి క్వారీలు ఉన్న పట్టణం ఇది. ఇక్కడ తొలిచిన ఎర్రరాయి ఢిల్లీ లాంటి మహానగరాలలోని భవనాలకు అందాలనిస్తున్నాయి. ఓ పదిహేను కిలోమీటర్ల దూరంలో పురాతన మొఘలాయి ఉద్యానవనముంది.

చుట్టూ వందలాది దేవాలయాలు కలిగిన మచ్‌కండ్ సరస్సు, ఆ దేవాలయాలకు ప్రతీసంవత్సరం వచ్చే తిరణాలతో అత్యంత శోభాయమానంగా

శంకర్

తీరుతుంది. బారి, దమోహ జలపాతాలు, తాలాబ్-ఎ-షాహీ సరస్సు, కాన్పూర్ మహల్, వన్‌విహార్ వన్యప్రాణి సురక్షిత ప్రాంతం తదితర ఆకర్షణీయ ప్రాంతాలు దీని దాపునే ఉన్నాయి.

సహజంగా ఆగష్టు నుంచి మార్చి మధ్యలో ఉండే వాతావరణంలో ఈ ప్రాంతానికి వెళ్ళడానికి ఆహ్లాదంగా ఉంటుంది. ఢిల్లీ నుంచి విమాన, రైలు, బస్సు మార్గాలున్నాయి. రాజస్థాన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుచేసే ప్రయాణ, వసతి సౌకర్యాలు ఉన్నాయి. జైపూర్ నుంచి కూడా అనేక ప్రయాణసౌకర్యాలు ఉన్నాయి. ❖

సెల్యులాయిడ్ శిల్పి ముజఫర్ అలీ ఇప్పుడొక "పద్మశ్రీ"

కవిత్వం, సంగీతం, కళాత్మకత అన్నీ మేళవించిన సినిమాలు తీసిన అతికొద్ది మంది హిందీ దర్శకుల్లో ఒకరు 'ముజఫర్ అలీ'. ముజఫర్ అలీపేరు అనగానే మనకు వెంటనే 'ఉమ్రావ్ జాన్' సినిమా గుర్తుకు వస్తుంది. ఈయనకు మొన్నటి రిపబ్లిక్ అవార్డుల్లో "పద్మశ్రీ" ప్రకటించారు.

హెచ్. రమేష్‌బాబు

ముజఫర్ అలీ ఇప్పటివరకు తీసిన చిత్రాలన్నీ కలిపి అరడజను కూడా ఉండవంటే ఆశ్చర్యపోవచ్చు. కానీ నిజం. లక్నోలో పుట్టి పెరిగిన ముజఫర్ అలీని ఆ నగర సంస్కృతి, సంప్రదాయాలు, జీవనశైలి బలంగా ప్రభావితం చేశాయి. అందుకేనేమో, గత వైభవం, చారిత్రక గాథలు ఆయన కిష్టమైన విషయాలైనవి. అసలు ముజఫర్ పుట్టింది నవాబుల ఇంట్లో. జమీందారీ విధానంలో అన్ని పార్శ్వాలను పసితనంలోనే చూసినవాడవటంవల్ల జనసామాన్యం లోని వేదనలను అర్థం చేసుకునే యత్నం చేశాడు. 1936నుండి 1952 దాకా ఎం.ఎల్.ఏ.గా పనిచేసిన తన తండ్రి రాజా సజ్జాద్ హుస్సేన్ కోరికమేరకు ముజఫర్ రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధపడలేదు. చదివిన భావనాత్మక కవిత్వం ఆయన్ను కళా ప్రపంచంవైపు మళ్లించింది.

అలీగఢ్ విశ్వవిద్యాలయం నుండి సైన్స్ గ్రాడ్యుయేట్ అయిన ముజఫర్అలీ రహిమసూరి రజా, జావేద్ కమల్, ఖలీలుల్ రహెమాన్, షహర్‌యార్; మఖ్దుంమొహిఫైద్దిన్, ఫైజ్ అహ్మద్ ఫైజ్‌ల కవిత్వంతో తన రాజకీయ అభిప్రాయాలను వామ పక్ష భావాలుగా జీర్ణించుకున్నవాడు. బాల్యంలో ఇష్టపడిన చిత్రలేఖనం, తర్వాత అభిమానించిన శాస్త్రీయ సంగీతం ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. వీటికితోడు ఆయన సృజనాత్మకత ఎలాగూ ఉండనే ఉంది. ఫ్యాషన్ డిజైనర్‌గానో, సినీ దర్శకునిగానో స్థిరపడాలనుకున్న అలీకి ఒక దశలో సత్యజిత్ రే తో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. 1966లో రే వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న క్లారియల్ మైకన్ అడ్వర్‌టైజింగ్ కంపెనీలో అలీ డైరెక్టర్‌గా చేరాడు. అతని కవి మిత్రుడు సుభాష్ ముఖోపాధ్యాయ కలకత్తాలోని కళాకారులతో చేయించిన పరిచయం అలీ ఆలోచనలను పూర్తిగా మార్చివేసింది.

ముజఫర్ అలీ సినీజీవితం మొదలైంది "గమన్"తో. ఫైజ్ అహ్మద్ ఫైజ్ కవితకు దృశ్య రూపమే "గమన్". 1978లో వచ్చిన ఈ సినిమా గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు వలసపోతున్న ప్రజలపై, వారి స్థితిగతులపై తీసినది. ఈ చిత్రంలో స్మితాపాటిల్ నటన అనితర సాధ్యం. ఈ చిత్రం ఏడవ "ఇఫి"లో స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకున్నది.

అలీ దర్శక ప్రతిభకు దర్పణం పట్టిన చిత్రం "ఉమ్రావ్‌జాన్" (1981). 19వ శతాబ్దంలో లక్నోలో వేశ్యాగృహంలో పెరిగిన ఉమ్రావ్‌జాన్ జీవిత కథే ఈ సినిమా. ఉమ్రావ్‌ని బాల్యంలోనే ఫైజాబాద్ నుండి ఎత్తుకొచ్చి లక్నోలోని ఒక వేశ్యా వాటికలో అమ్మివేస్తారు. లక్నోలోనే ఆమె పెరిగి పెద్దదవుతుంది. చదువు, సంగీతం, నాట్యం అన్నీ నేర్చుకుంటుంది. ఆమె తన కళానైపుణ్యంతో లక్నో నగరాన్నంతా ప్రభావితం చేస్తుంది. ఆమె జీవితంలోకి నవాబ్ సుల్తాన్, గౌహెర్ మీర్జా, ఫైజ్ అలీలు ప్రవేశిస్తారు. ఈ మధ్యలో ఆమె వేశ్యాగృహం నుండి పారిపోయే ప్రయత్నం చేస్తుంది. చివరికి ఆమె రక్తసంబంధీకులే ఆమెను ఆదరించరు. ఉమ్రావ్‌గా రేఖ నటన హిమాలయ శృంగాన్ని అందుకున్నది. చిత్రంలో నాటి సామాజిక స్థితులు, వేశ్యా సంస్కృతికి ఈ సినిమా ఓ దర్పణం వంటిది. "ఉమ్రావ్ జాన్" 1982 ఇండియన్ పనోరమకు ఎంపికైంది. మనీలా, తాష్కెంట్ ఫెస్టివల్స్‌లో పాల్గొన్నది. మరోవైపు ఆ యేటి జాతీయ అవార్డులలో ఉమ్రావ్‌జాన్ ఉత్తమనటి (రేఖ), ఉత్తమగాయని (ఆషా భోంస్లే), ఉత్తమ సంగీత దర్శకుడు (ఖయ్యాం), ఉత్తమ కళాదర్శకుడు అవార్డులు చేజిక్కించుకుంది.

ఉమ్రావ్‌జాన్ తరువాత ముజఫర్ తీసిన చిత్రం "ఆగమన్". ఉత్తర ప్రదేశ్ జన జీవితం నేపథ్యంగా తీసిన ఈ సినిమా విడుదలవలేదు. నాలుగో చిత్రం లక్నో చికాన్ నేతపనివారిపై తీసిన 'అంజుమన్' (1985). చికాన్ నేత పనివారిలో అత్యధికులు స్త్రీలే. వారి శ్రమదోపిడిని చిన్నప్పటి నుంచి చూసిన అలీ వారి జీవితాలను కళ్లకు కట్టినట్లు చూపాడు. 1985లో వచ్చిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలందుకుంది. "కేవలం ఒక వర్గంవారి దోపిడీని చూపించి పరిష్కారాలు సూచించేందుకు నేను ప్రయత్నించలేదు. చారిత్రక వాస్తవాలు, ప్రాంతీయ జీవన సరళిని మేళవించి ప్రేక్షకులని ఆలోచింప చేయాలనే ఉద్దేశంతోను 'అంజుమన్' తీశానంటారు ముజఫర్. ఈ చిత్రంలో ప్రధానపాత్ర "అంజుమన్"గా షబానా అజ్మీ నటించారు. రోహిణి హట్టంగడి కూడా మరో ప్రధానపాత్రలో కనిపిస్తారు. ఈ సినిమా విశేషమేమిటంటే ఖయ్యాం సంగీతంలో షబానాతో మూడుపాటలు పాడించడం.

అనంతరం అలీ కాశ్మీర్ కవయిత్రి హబ్బా ఖ టూన్ కథ ఆధారంగా 16వ శతాబ్దంలోని కాశ్మీర్‌ను చూపే సినిమాను ప్రారంభించారు. అదే "జానీ". డింపుల్ కపాడియా, వినోద్‌ఖన్నా, ప్రాణ్‌లు నటించిన ఈ సినిమాకోసం బడ్జెట్ ఆరుకోట్లు. బెర్నార్డో బెర్ట్‌లోచి 'ది లాస్ట్ ఎంపరర్" సంగీత దర్శకుడు రయాని సకమోటో మ్యూజిక్ చేశారు. కాని ఈ చిత్రం అర్ధాంతరంగా ఆగిపోయింది. ఇదిలా ఉంచి దేశవిభజన ఇతివృత్తంగా మనీషాకోయిరాలతో "దామన్" సినిమాను ప్లాన్ చేశారు.

ఫీచర్ ఫిలింలే గాక అలీ కొన్ని డాక్యుమెంటరీలు తీశారు. లక్నో నేపథ్యంలో నడిచే ముజఫర్ సినిమాల్లో కనిపించే సాధారణ అంశం – "దోపిడి వ్యతిరేకత". ఉన్నవారు లేనివారిని దోపిడి చేయడాన్ని వ్యతిరేకిస్తాననీ, తనను సెల్యులాయిడ్ వైపు మళ్లించింది ఆ భావాలేనని, ప్రతిమానవుడు స్వేచ్ఛా జీవి అనీ, పౌర హక్కుల సారం ఇదేనని" అంటాడాయన. తన సినిమాలు అందంగా రావాలని కోరుకుంటాడు. దృశ్యాల మీద సంగీతం మీద ఆసక్తి ఎక్కువ. అందుకే ప్రతిసీనూ బొమ్మలతో సహా గీసుకుని ఆల్బం రూపొందించుకుంటాడు. ఇంత గొప్ప ప్రతిభావంతమైన ఈ దర్శకునికి ఇప్పుడు "పద్మశ్రీ" మరింత గౌరవాన్ని పెంచుతుంది. ❖

మాష్టార్ల మానిఫెస్టో

తరగతి గది
ఆలోచనల సంఘర్షణా కేంద్రమైనప్పుడు
బాల్యం
ఓ సున్నిత కుసుమం
మెత్తని ఇనుము
పారే సెలయేరు
నిత్య నూతన పరిశోధన
తళుక్కున మెరిసే మెరుపు
ఒక ఆలోచన
ఓ మానసికానందం
మనోవిజ్ఞాన దీపిక
మానసికోల్లాసం
కిండర్ గార్డెన్‌లో తిరిగే ఓ సీతాకోకచిలుక తరగతి
గది
వస్తు కర్మాగారమైనప్పుడు
బాల్యం భారమైన భవిష్యత్ ప్రతిక
స్వేచ్ఛగా గెంతే లేగ మెడలో గుది బండ
గడ్డకట్టిన మంచు దిబ్బ



బ్యాంక్ ట్రాన్‌సాక్షన్ కాగితం
ఒక భౌతిక మార్పు
నిపుణుడి చేతిలో తయారైన
ఓ 'మానవ బాంబు'
ప్రియమైన నా పంతుళ్ళారా ముందుగా
మనల్ని మనం ప్రేమించుకుందాం
ఇక ప్రేమించడమూ తెలుస్తుంది
ప్రేమించబడటమూ ఉంటుంది
దేశ భవిష్యత్‌ని తరగతి గదుల్లో రూపుదిద్దే
రూప 'శిల్పు' లారా...
భవిష్యత్ ఉన్నప్పుడే చరిత్రకర్థం
అక్షరం
వేయి మెదళ్ళకు పదును
అలుపుండనిది
ఒక్క అక్షరానికే కదా...!!
పదండి భవిష్యత్ బాటలువేద్దాం.

-సైదులు ఐనాల

ప్రయి"వేటు" కొన్ని స్కూళ్ళు...



ప్రయివేటు కొన్ని స్కూళ్ళు పేరుకేమో రికగ్నైజ్డ్
గుర్తించని పంతుళ్ళతో నడిపేటి సంతలు
అంతటిది ఇంతటిది వాళ్ళ స్కూలు అంటంటు
పిల్లల్ని చేర్చమంటు డొనేషన్లు గుంజేరు
మార్కులకు కొదవరాదు విద్యలెవలు ఫికరువద్దు
స్టాండర్డ్, సెట్టింగులకు వారి స్కూలే తార్కాణం
అనేసి దోచేసే, మనసంతా తినేసే వ్యాపార సంతలు
పంతుళ్ళ విద్య చూపి స్ట్రెన్త్‌నేమొ పెంచెదరు
స్ట్రెన్త్‌నేమొ పెంచుటకు స్కూళ్ళ గూర్చిప్రకటనలు
లేని గ్రౌండు ఉందంటు అనవసరపు ప్రాపగాండ
కంప్యూటరు ఆశ చూపి కంపులోకి దింపేరు
కరాటే అంటంటు సంగీతం పాడేరు
ల్యాబ్ అంటు ఉందని లెక్చర్లు దంచేరు
ప్రయివేటు కొన్ని స్కూళ్ళు ధనిక వర్గ ప్రతీకలు
గుర్తింపు లేకుండా పరీక్షలు నడిపేరు
గుర్తింపు ఉందని జవాబులన్ని వ్రాయించేరు
కెమేరాలున్నను ఆ చిత్రం ఎక్కదెందుకో
గేటు తాళ ప్రభావమో అధికారులకు తాళమేసిన ప్రభావమో
జీతాలు అతి కొంచెం... ఇచ్చేది ఆలస్యం
పంతుళ్ళకు సెలవిచ్చి పస్తులనే పెట్టేరు
ఎండలకు మాడ్చేరు ఎండకట్టెలా రమ్మనేరు
తుమ్ము తుమ్ముకూడిపోయె ఉద్యోగం ఇచ్చేరు
సంస్థ ప్రోపగాండకు వీధి వీధి తిప్పేరు
పంతుళ్ళ కష్టంతో జీవించే పరాన్న జీవులు
ప్రయివేటు కొన్ని స్కూళ్ళు పేరుకెమొ రికగ్నైజ్డ్
గుర్తించని పంతుళ్ళతో నడిపేటి సంతలు

-పేటేటి రత్న

అక్షరమాల

అమ్మఒడి ఎప్పుడైనా చల్లదనం ఇస్తుంది
ఆకాశం అందరికీ సమానతను పంచుతుంది
ఇష్టపడి కష్టపడితే ఏదైనా వరిస్తుంది
ఈశాన్యం మూలంటే కొందరికి భయమేస్తుంది
ఉలి దెబ్బలు తింటేనే శిల శిల్పం అవుతుంది
ఊరంత ముగ్గేస్తే సంక్రాంతి అవుతుంది
ఎడారిలో ఒయాసిస్సు ఉల్లాసం ఇస్తుంది
ఏ గుడిలో గంటైనా భక్తిని ప్రబోధిస్తుంది
ఐశ్వర్యం మనిషిలో ఆశలనే పెంచుతుంది
ఒకరిద్దరు కూడితేనే సంభాషణ పెరుగుతుంది
ఓనమాలు నేర్చునపుడు చేయి కాస్త వణుకుతుంది
ఔన్నత్యం ఎవరినైనా ఉన్నతంగా నిలుపుతుంది

-రాజమిత్ర

ADVOCATE

న్యాయసలహాలు



జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

అంగన్‌వాడీ టీచర్లకు ఉద్యోగభద్రత ఉందా?

మేము అంగన్‌వాడి కార్యకర్తలుగా 2003 సెప్టెంబరు నుండి పనిచేయుచున్నాము. నాకు నెలకు మొదట 500రూ. వేతనం ఇచ్చేవారు. ఇప్పుడు దానిని 1000రూ. పెంచారు. ఇంకో రెండు వందలు రూపాయలు పెంచుతామని అంటున్నారు. పై అధికారులు ఆదేశించిన విధులు అన్నీ మేము నిర్వహిస్తున్నాము. మాకు ఉద్యోగ భద్రతయున్నదా? లేక వారిఇష్టమొచ్చినప్పుడు మమ్ములను తొలగిస్తారా? మాకు రాష్ట్ర ఉద్యోగులతోపాటు సమాన వేతనం ఇవ్వడానికి అవకాశం లేదా? జాతీయస్థాయిలో అంగన్‌వాడి కార్యకర్తలు ఆరులక్షల మంది ఉన్నారంటున్నారు. వీరందరినీ తొలగించటం ప్రభుత్వానికి సాధ్యమేనా? మా ఉద్యోగానికి భద్రత ఉండాలంటే మేం ఏంచేయాలి? వివరాలు తెలుపగలరు. మాకు జీతభత్యాలు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు భరిస్తున్నారా లేక అంతర్జాతీయ సహాయ నిధుల నుండి వచ్చుచున్నవా?

వై. రమాదేవి.

సత్తెనపల్లి.

సామాన్యంగా అంగన్‌వాడి ఉద్యోగాలు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు కావు. అయితే వాటిని రాష్ట్ర ఉమెన్ వెల్‌ఫేర్ డిపార్ట్‌మెంట్ వారి ఆధ్వర్యంలో నడుపబడుతుంది. దీనికి స్టేట్ గవర్నమెంట్ గ్రాంట్సు సమకూరుస్తుంది. ఈ అంగన్ వాడి ఉద్యోగాలు ఇప్పటికిప్పుడు తొలగించే వీలులేదు. ఎందుకంటే మహిళా శిశుసంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రంలోనేకాక దేశంలోనే చాలా అభివృద్ధి జరగవలసి వున్నది. పోతే మిమ్మల్ని రాష్ట్ర ఉద్యోగుల స్థాయిలో చేర్చుకుని మీకు భద్రత కల్పించవలెనంటే మీ యూనియన్‌ల ద్వారాగాని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల ద్వారాగాని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి చేయించుకోవాలి. పైన చెప్పినట్లు అంగన్‌వాడి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చులు భరిస్తున్నది. వీరికి కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు కొంత సహాయ నిధులు (బడ్జెట్ అలాట్‌మెంట్) ఇస్తుండటంతో అంతర్జాతీయ సహాయమేది లేకుండవచ్చు.

లైబ్రేరియన్ ఉద్యోగం- ప్రొబేషన్-డిక్లరేషన్

నేను గుంటూరు జిల్లా గ్రంథాలయంలో చుండూరు మండలంనందు 13-7-1990 సంవత్సరంలో లైబ్రేరియన్‌గా చేరినాను. 24-12-1994 సంవత్సరంలో నాకు సర్వీస్ రెగ్యులరైజేషన్ చేసినారు. ప్రొబేషన్ చేయలేదు.

తరువాత నాకు వివాహము జరిగినది. 25-1-19995 సంవత్సరంలో నెల్లూరు జిల్లాకు బదిలీ అయినాను. నాకు సర్వీస్ ప్రొబేషన్ గుంటూరుజిల్లా గ్రంథాలయసంస్థవారు చేయలేదు. నెల్లూరుజిల్లా గ్రంథాలయసంస్థవారు కూడా చేయలేదు.

ప్రస్తుతం నేను నెల్లూరుజిల్లా విడవలూరు మండలంనందు లైబ్రేరియన్‌గా పని చేయుచున్నాను. తగిన సలహా ఇవ్వగలరు.

బి. సుశీల

నెల్లూరుజిల్లా

మీరిచ్చిన వివరాలను బట్టి మీ సర్వీసు 24-12-1994 సంవత్సరములో రెగ్యులరైజేషన్ అయ్యింది. అయితే మీరు 25-1-1995 సంవత్సరము నుండి నెల్లూరు జిల్లాలో పని చేశారు. కాబట్టి మీ ప్రొబేషన్ డిక్లరేషను నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థవారు చేయాలి. దానికి ఛైర్మన్‌కుగాని, సంబంధిత అధికారులకుకాని అర్జీ పెట్టుకోవాలి. ప్రస్తుతం కూడా నెల్లూరు జిల్లాలోనే మీ సర్వీసు అంతా ఉంది.

బోయకులం రిజర్వేషన్‌లోనే పరిగణిస్తే నష్టమేమీ లేదు

2004లోనా డిగ్రీ పూర్తి అయింది. మాది 'శెట్టి బలిజ' కులము. చిన్నప్పటినుండి నా చదువు అంతయు 'బోయ' కులముగా జరిగింది. మా పెద్దలు నిరక్షరాస్యులు అగుటచే ఎక్కడో తప్పిదం జరిగింది. నేను ఇప్పుడు బి.ఇడి. వ్రాయాలనుకున్నాను. ముందు ముందు నేను మా కులము శెట్టిబలిజగా మార్చుకోవచ్చా? మార్చుకోవాలంటే ఏం చేయాలి? 10వ తరగతి టీ.సీ. లో కూడా బోయ కులంగా వుంది. శెట్టి బలిజ (ఓ.సి) గా మార్చుకొనుటకు వీలుందా లేదా? ఎవరిని సంప్రదించాలి? ఎన్నో సార్లు మా క్యాస్ట్‌ను మార్చుటకు ప్రయత్నం జరిగింది. అయినా వీలు కాలేదు. ఇప్పుడు బి.ఇడి. ఇతర కాంపిటీటివ్ పరీక్షలు రాస్తే ఏమైనా ఇబ్బంది వుంటుందా? సలహా ఇవ్వగలరు.

డి. అంజి, కర్నూలు జిల్లా.

మీ వివరాలను బట్టి మీ స్కూల్ రికార్డ్స్ అన్నిట్లోనూ మిమ్మల్ని బోయకులముగా పరిగణించబడినది. నిజానికి మీరు శెట్టిబలిజ కులం అయినా కూడా మీ స్కూల్ కాలేజి రికార్డ్స్ సవరించాలంటే కమీషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ /సెక్రటరీ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ వారిని సంప్రదించాలి. దీనికి తగిన ఆధారాలుండాలి. మీరు చెప్పినదాని ప్రకారం ఇంతకముందు ప్రయత్నం చేసినట్లు, అయినా వీలుకాలేదని వ్రాసినారు. అలాంటప్పుడు మళ్లీ ప్రయత్నం చేయడం అంత సబబు కాదేమో. మీ స్కూల్, కాలేజీ రికార్డ్స్‌లో మొదటినుంచీ బోయకులంలోనే పరిగణించబడ్డారు. కాబట్టి మీరు ఏ ఎగ్జామ్స్ వ్రాసినా బి.ఇడి కూడా వ్రాయడానికి మీకు ఎలాంటి ఆటంకాలు రావు. మిమల్ని బోయ కులం రిజర్వేషన్‌లోనే పరిగణిస్తారు.

రుచి

కొబ్బరి దోసెలు

కావలసిన వస్తువులు:

కొబ్బరికాయ	:	ఒకటి
బియ్యం	:	పావు కిలో
మినపప్పు	:	అర కిలో
పచ్చిమిర్చి	:	పది
పెద్ద ఉల్లిపాయలు	:	నాలుగు
అల్లం	:	చిన్న ముక్క
జీలకర్ర	:	ఒక స్పూన్
నూనె	:	వంద గ్రాములు
ఉప్పు	:	తగినంత

తయారుచేసే విధానం: కొబ్బరి కోరుకోవాలి. మినప్పప్పు, బియ్యం రెండు లేక మూడు గంటల ముందుగా నానబెట్టుకోవాలి. మినప్పప్పు, బియ్యం కడిగి కొబ్బరి కోరుతో కలిపి మెత్తగా రుబ్బాలి. అల్లం, పచ్చిమిర్చి, పెద్ద ఉల్లిపాయలు సన్నగా ముక్కలు కోసుకోవాలి. ఈ తరిగిన ముక్కలు, ఉప్పు, జీలకర్ర పిండిలో కలపాలి. పొయ్యి మీద పెనం పెట్టి నూనె రాసి గరిటెతో కొద్దిగా మందంగా దోసెవేసి మూత పెట్టాలి. ఐదు నిముషాల తరువాత మూత తీసి దోసె చుట్టూ, పైన నూనె రాసి తిరగవెయ్యాలి. ఇలా అన్ని దోసెలు వేసుకోవాలి. వీటిని సన్న సెగ మీద కాల్చుకోవాలి. ఈ పిండి రుబ్బి మరుసటి రోజు వేసుకుంటే కొంచెం పుల్లగా, మెత్తగా పొంగి చాలా రుచిగా ఉంటాయి.

రవ్వ ఇడ్లీ

కావలసిన వస్తువులు:

రవ్వ	:	ఒక గ్లాసు
పెరుగు	:	ఒక కప్పు
పచ్చిమిర్చి	:	ఆరు
అల్లం	:	చిన్న ముక్క
ఉల్లిపాయ	:	ఒకటి
కొత్తిమీర	:	ఒక కట్ట
క్యారెట్	:	రెండు
కరివేపాకు	:	నాలుగు రెబ్బలు
జీలకర్ర	:	రెండు స్పూన్లు
ఉప్పు	:	తగినంత

తయారుచేసే విధానం: రవ్వలో పెరుగు, ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు గంటలు నాననివ్వాలి. కొత్తిమీర, కరివేపాకు సన్నగా తరగాలి. పచ్చిమిర్చి, ఉల్లిపాయ, అల్లం చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. క్యారెట్ తురుముకోవాలి. ఈ ముక్కలన్నింటినీ రవ్వలో కలిపి ఇడ్లీ పాత్రలో ఇడ్లీలు వేయాలి. దానిలోకి కొబ్బరి చట్నీ బాగుంటుంది. సాంబారు కూడా వేసుకోవచ్చు. ఈ ఇడ్లీ అందంగా వెరైటీ రుచితో ఉంటాయి. ఇవి వేడి మీద బాగుంటాయి.

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: **కలం స్నేహం**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : దారం ప్రవంతి
వయసు : 14 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : డ్యాన్స్ చేయడం, క్యారమ్స్ ఆడడం, బొమ్మలేయడం
లక్ష్యం : గొప్ప డ్యాన్సర్ కావడం.
చిరునామా: దారం ప్రవంతి, డాటరాఫ్ కుమారస్వామి, ఇంటి నెం.9-31, వెంకట రమణ మెడికల్ స్టోర్స్, తొర్రూర్, వరంగల్ -502103.

పేరు : డి.వెంకట రవితేజ
వయసు : 13 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : షటిల్ ఆడడం, సైన్సు పుస్తకాలు చదవడం
స్కూలు : ఆదిత్య ఉన్నత పాఠశాల
చిరునామా : డి.వెంకట రవితేజ, సన్నాఫ్ డి.వి నారాయణ, పామూరు, ప్రకాశం .

పేరు : ఎం.డి.వాజీద్
వయసు : 10 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : బొమ్మలేయడం, క్రికెట్ ఆడడం, ప్రజాశక్తి పేపరు చదవడం, కథలు చదవడం
స్కూలు : ప్రగతి విద్యాలయం
చిరునామా : ఎం.డి.వాజీద్, సన్నాఫ్ ఎం.డి. ఆలం, పరిగి (గ్రామం, మం), రంగారెడ్డి.

పేరు : జి.నిఖిత
వయసు : 8 సం॥
చదువు : 4వ తరగతి
హాబీలు : బొమ్మలేయడం, చదవడం, ఆటలు ఆడడం, రాయడం
స్కూలు : సిపిఎస్
చిరునామా : జి.నిఖిత, డాటరాఫ్ జి.నారాయణ, ఇంటి నెం.11-80, కేశవ నగర్, మక్తల్ (గ్రా, మం), మహబూబ్ నగర్-509208.

పేరు : ఇస్లావత్ శంకర్
వయసు : 14 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడడం, టీవీ చూడడం, వాలీబాల్ ఆడడం, పాడుపు కథలు తయారు చేయడం, కథలు రాయడం, చదవడం
లక్ష్యం : డాక్టరు కావడం
చిరునామా : ఇస్లావత్ శంకర్, సన్నాఫ్ సుందర్, ధనిసింగ్ నాయక్ తండా, కాచికల్ (గ్రా), నెల్లికుదురు (మం), వరంగల్.

పేరు : వై.ఫణి కృష్ణ ప్రియ
వయసు : 11 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : చదరంగం ఆడటం, అల్లరి చేయడం, చదవడం
లక్ష్యం : కలెక్టర్‌కావడం
చిరునామా : **వై.ఫణి కృష్ణ ప్రియ,** డాటరాఫ్ వై.నిర్మలా రవికుమార్, సుందర్‌నగర్ కాలనీ, దుర్గాపురం, విజయవాడ-3

పేరు : మోతుకూరి నవీన్ (చంటి)
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
హాబీలు : ఆడడం, చదవడం, రాయడం, పాటలు పాడడం
లక్ష్యం : పోలీస్ ఆఫీసర్ కావడం
చిరునామా: మోతుకూరి నవీన్, సన్నాఫ్ రామకృష్ణ, ఇంటి నెం. 7-113, శ్రీనగర్ 1 లేన్, కొత్తగూడెం, ఖమ్మం.

పేరు : పి.వి.ప్రవీణ్ కుమార్ యాదవ్
వయసు : 12 సం॥
చదువు : 7వ తరగతి
హాబీలు : ఆటలు ఆడడం, టీవీ చూడడం, ప్రజాశక్తి పుస్తకం చదవడం, క్రికెట్ ఆడడం
లక్ష్యం : ఐపిఎస్ కావడం
చిరునామా : పి.వి.ప్రవీణ్ కుమార్ యాదవ్, సన్నాఫ్ పి.వెంకట రమణ, ఇంటి నెం. 13-948, వేపంల్లె (గ్రామం), కడప.